




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States








సంపుటి : 23 | సంచిక : 267 | ది. 31-12-2024 | విజయవాడ | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


# రాష్ట్రానికి మరో రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు

- 2,63,411 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు
- క్లీన్ ఎనర్జీ పాలసీతో క్యూ కడుతున్న సంస్థలు
- ఎస్ఐపీబీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం




**అమరావతి,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు పెద్దఎత్తున వస్తున్న సంస్థలకు భూకేటాయింపులతో సహా మౌలిక వసతులను శరవేగంగా కల్పించాలని, అదేవిధంగా ఒప్పందం ప్రకారం నిర్దిష్ట సమయంలోనే ప్రాజెక్టులు పూర్తయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి ఇస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాల ద్వారా మరింతగా పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. సోమవారం సచివాలయంలో జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో రాష్ట్రంలో వివిధ సంస్థలు ఏర్పాటు చేయదలిచిన ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. మొత్తం 9 ప్రాజెక్టులు రాష్ట్రానికి కొత్తగా వస్తున్నాయని, వీటి ద్వారా రూ. 1,82,162 కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు రూ. 2,63,411 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

**బీపీసీఎల్‌తో సహా ప్రతిష్టాత్మక సంస్థల రాక :** భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) నెల్లూరు జిల్లా రామయ్యపట్నంలో 6 వేల ఎకరాల్లో రూ. 96,862 కోట్ల పెట్టుబడితో భారీ రిఫైనరీ ఏర్పాటు చేయనుందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీంతో 2,400 మందికి ఉపాధి కలుగనుందని చెప్పారు. మొత్తం 9 మిలియన్ మెట్రిక్ టన్నులు సామర్ధ్యంతో ఐదు బ్లాకుల్లో రానున్న ఈ ప్రాజెక్టులో టౌన్‌షిప్, లెర్నింగ్ సెంటర్, రిఫైనరీ, పెట్రోకెమికల్స్ యూనిట్స్, క్రూడ్ ఆయిల్ టెర్మినల్, గ్రీన్ హెచ్2, అడ్మినిస్ట్రేషన్ బ్లాకులు నిర్మిస్తారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వచ్చే 20 ఏళ్లలో ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి రూ. 88,747 కోట్ల ఆదాయం రానుందని తెలిపారు. అయితే 2029లోగా మొత్తం ప్రాజెక్టు పూర్తయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు.

**టీసీఎస్ :** విశాఖపట్నంలోని మిలీనియం టవర్స్‌లో 2,08,280 చదరపు అడుగుల విస్తీర్ణంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రూ. 80 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. దీంతో 2 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి.

**ఆజాద్ మొబిలిటీ ఇండియా లిమిటెడ్ :** శ్రీ సత్యసాయి జిల్లా గుడిపల్లిలో ఆజాద్ మొబిలిటీ ఇండియా లిమిటెడ్ 70.71 ఎకరాల్లో మూడు దశల్లో వచ్చే ఆరేళ్లలో పూర్తయ్యేలా ఎలక్ట్రిక్ త్రీ వీలర్ ట్రక్కులు, బస్సులు, బ్యాటరీ ప్యాక్‌ల గ్రీన్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం ఈ సంస్థ రూ. 1,046 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 2,381 మందికి ఉపాధి కలుగుతుంది.

**బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ :** అనకాపల్లి జిల్లా రాంబిల్లిలోని 106 ఎకరాల్లో రూ.1,174 కోట్లతో 1,500 మందికి ఉపాధి కలిగేలా బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీఎఫ్/పర్టికల్ బోర్డు ప్లాంట్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నెలకొల్పనుంది.

**క్లిక్ అయిన క్లీన్ ఎనర్జీ పాలసీ :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన క్లీన్ ఎనర్జీ పాలసీతో పలు సంస్థలు భారీ పెట్టుబడులతో రాష్ట్రానికి వస్తున్నాయి. కొత్తగా ఐదు సంస్థలు రూ. 83 వేల కోట్ల పెట్టుబడితో వివిధ ప్రాజెక్టులను రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్నాయి. దీంతో కేవలం క్లీన్ ఎనర్జీ రంగంలోనే రెండున్నల లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి.

**ఏఎం గ్రీన్ అమ్మోనియా(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ :** ఏఎం గ్రీన్ అమ్మోనియా(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కాకినాడలో 592 ఎకరాల్లో 1 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్ధ్యంతో గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత అమ్మోనియా మాన్యుఫాక్చరింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తోంది. రూ. 12,000 కోట్ల పెట్టుబడితో 2,600 మందికి ఉపాధి కలుగుతుంది.

**జాన్ కోకిరిల్ గ్రీన్‌కో హైడ్రోజన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ :** జాన్ కోకిరిల్ గ్రీన్‌కో హైడ్రోజన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కాకినాడలో 40 ఎకరాల్లో 2 గిగావాట్ల సామర్ధ్యం కలిగిన ఎలక్ట్రోలైజర్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను రూ. 2,000 వేల కోట్లతో స్థాపించనుంది. దీంతో 500 మందికి ఉపాధి కలుగుతుంది.

**టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ :** 400 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టును టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ కర్నూలు జిల్లాలోని హొసూరు, పెద్ద హుల్తిలో 1,800 ఎకరాల్లో ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ. 2,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 1,380 మందికి ఉపాధి కలుగుతుంది.

**క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ హైబ్రిడ్ త్రీ ప్రైవేట్ లిమిటెడ్ :** వైఎస్సార్ జిల్లాలోని మైలవరం, కొండాపురం అలాగే నంద్యాల జిల్లాలోని కొలిమిగుండ్లలో మొత్తం 1,080 ఎకరాల్లో 119 మెగావాట్ల విండ్ పవర్, 130 మెగావాట్ల సోలార్ హైబ్రీడ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ హైబ్రిడ్ త్రీ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 2,000 కోట్ల పెట్టుబడులు పెడుతోంది. 650 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానున్నాయి.

**రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ :** రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రాష్ట్రంలో తాజాగా 65 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. రాష్ట్రమంతటా 5 లక్షల ఎకరాల్లో రెండున్నర లక్షల మందికి ఉపాధి కలిగేలా 11 వేల మెట్రిక్ టన్నుల సామర్ధ్యంతో 500 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు మొత్తం 2028 కల్లా పూర్తి కానుంది. దీని ద్వారా రాష్ట్రానికి రూ. 4,095 కోట్ల ఆదాయం రానుంది. నవంబర్ 19న జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపిన వివిధ ప్రాజెక్టుల పురోగతి గురించి కూడా ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# ఏపీ నూతన సీఎస్‌గా విజయానంద్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



**అమరావతి,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** రాష్ట్రప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా కె.విజయానంద్ నియమితులయ్యారు. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ను సీఎస్‌గా నియమిస్తూ ఆదివారం రాత్రి ప్రభుత్వ ఉత్తర్వులు విడుదలయ్యాయి. విజయానంద్ ప్రస్తుతం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం పదవీవిరమణ చేయనున్నారు. ఆ స్థానంలో కొత్త సీఎస్‌గా విజయానంద్ బాధ్యతలు చేపడతారు. వైఎస్సార్ జిల్లా రాజుపాలెం మండలం అయ్యవారిపల్లె ఆయన స్వస్థలం. ఆదిలాబాద్ జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ నిర్వహించారు. అనంతరం రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, శ్రీకాకుళం, నల్గొండ జిల్లాల కలెక్టర్‌గా పనిచేశారు. ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో ఎండీగా సుదీర్ఘకాలం పాటు కొనసాగారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ)గానూ పనిచేశారు. 2025 నవంబరులో విజయానంద్ పదవీ విరమణ చేయనున్నారు. విజయానంద్ పదవీకాలం ముగిశాక.. సీఎస్‌గా జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌ను నియమించే అవకాశముంది. ఆయనకు 2026 ఏప్రిల్ వరకూ సర్వీసు ఉంది. సీనియారిటీ ప్రాతిపదికన చూస్తే 1991 బ్యాచ్‌కు చెందిన సాయిప్రసాద్ ముందుంటారు. కానీ, ఆయన్ను ఇప్పుడు సీఎస్‌గా నియమిస్తే ఆయన పదవీకాలం ముగిసేలోపే విజయానంద్ రిటైర్ అయిపోతారు. అందుకే విజయానంద్‌కు ప్రభుత్వం ప్రస్తుతం సీఎస్‌గా అవకాశం కల్పించింది.

# కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి..

- మరో 50 లక్షల ఇళ్ల నిర్మాణానికి లక్ష్యాలు సిద్ధం.
- గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి.



**అమరావతి,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తిచేశామని, వచ్చే మార్చి నాటికి మరొక 50వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయటానికి లక్ష్యాలను నిర్దేశించాలని రాష్ట్ర గృహనిర్మాణం,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు.పార్థసారథి అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో అమలు అవుతున్న గృహనిర్మాణల పై మంత్రి సోమవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు.రాష్ట్రంలో పూర్తి అయిన లక్ష ఇళ్ల నిర్మాణలకు త్వరలో ప్రారంభించి లబ్ధిదారులుకు ఇంటి తాళాలు అందించే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో నిర్వహించాలని మంత్రి ఆదేశించేరు.రాష్ట్రంలో ఒక జిల్లాలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటారని,మిగిలినజిల్లాలలో మంత్రులు,శాసనసభ్యులు,ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొని లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందిస్తారని,ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సూచించారు. ఇళ్ళు నిర్మాణాలు జరిగిన కాలనీలకు మౌలిక సదుపాయాలు కలిగించాటానికి చర్యలు చేపట్టాలని, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ,పంచాయితీరాజ్,విద్యుత్ తదితర అధికారులతో సమావేశలు నిర్వహించి ప్రణాళికలు రూపొందించాలని,మంత్రి ఆదేశించారు.అవసరమైతే పంచాయితీరాజ్,రహదారులు,భవనాలు,పురపాలక శాఖ మంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి నిధులు విడుదలకు మంత్రుల స్థాయిలో సమావేశాలు నిర్వహిద్దామని మంత్రి పార్ధ సారధి వివరించారు.ప్రతీ రోజు జిల్లా అధికారులుతో సమావేశాలు నిర్వహించాలని,ఇళ్లనిర్మాణాలలో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు.రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కే.రాజబాబు రాష్ట్రంలో లక్ష ఇళ్ల ప్రారంభోత్సవాలకు తీసుకుంటున్న చర్యలను మంత్రికి వివరించారు.ఈ సమావేశంలో గృహనిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీర్ జీ.వీ.ప్రసాద్,సూపరేండెంట్ ఇంజినీర్లు జయరామాచారి, నాగభూషణం ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గోటితో పోయే దాన్ని గోడ్డలి వరకు తెచ్చారు...
# బన్నీ అరెస్ట్ వివాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- ఈరోజు మంగళగిరిలో మీడియాతో మాట్లాడిన జనసేనాని
- బన్నీ విషయంలో తెర ముందు, వెనుక ఏం జరిగిందో తనకు తెలియదన్న పవన్
- అల్లు అర్జున్ తరపున బాధిత కుటుంబం వద్దకు ముందే వెళ్లి ఉండాల్సిందని వ్యాఖ్య
- ఇలాంటి ఘటనల్లో పోలీసులను తప్పుపట్టలేనన్న డిప్యూటీ సీఎం



**అమరావతి,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** ఈ నెల 4న 'పుష్ప2' ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన, నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ వివాదంపై తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఈరోజు మంగళగిరిలో జనసేనాని మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గోటితో పోయే దాన్ని గోడ్డలి వరకు తెచ్చారని పవన్ పేర్కొన్నారు. "బన్నీ విషయంలో తెర ముందు, వెనుక ఏం జరిగిందో నాకు తెలియదు. ఇలాంటి ఘటనల్లో పోలీసులను తప్పుపట్టను. చట్టం అందరికీ సమానమే. పోలీసులు తప్పకుండా భద్రత గురించి ఆలోచిస్తారు. థియేటర్ స్టాఫ్ అల్లు అర్జున్‌కు ముందు చెప్పి ఉండాల్సింది. ఆయన కూర్చున్నాక చెప్పి తీసుకెళ్లాల్సింది. చెప్పినా ఆయనకు ఆ అరుపుల్లో సరిగా వినిపించకపోవచ్చు. అల్లు అర్జున్ తరపున బాధిత కుటుంబం వద్దకు ముందే వెళ్లి ఉండాల్సింది. చిరంజీవి కూడా గతంలో ఫ్యాన్స్‌తో కలిసి థియేటర్‌లో సినిమాలు చూసేవారు. కానీ, ఆయన ముసుగు వేసుకుని ఒక్కరే థియేటర్‌కు వెళ్లేవారు. ఇక తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కింది స్థాయి నుంచి వచ్చిన గొప్ప నాయకుడు. వైసీపీ విధానాల తరహాలో అక్కడ ఆయన వ్యవహరించలేదు. ఆ రాష్ట్రంలో బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపునకు అవకాశం ఇచ్చారు" అని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు.

# ఇది చేతల ప్రభుత్వం

- చంద్రబాబు హయాంలో బీసీలకు పెద్ద పీట
- గత ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం
- టీటీడీ ఈవో, ప్రభుత్వ సీ.ఎస్ గా బీసీలను నియమించడం హర్షణీయం
- రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని, గత ప్రభుత్వంలా మాటల ప్రభుత్వం కాదని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బీసీ వ్యక్తి అయిన విజయానంద్ నియామకం చంద్రబాబుకు, ఎన్డీయే ప్రభుత్వానికి బీసీలపై ఉన్న గౌరవాన్ని తెలియచేస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, బీసీలపై దాడులు జరిగాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలోనే ప్రధానమైన, బాధ్యతాయుతమైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా, ప్రపంచ వ్యాప్తంగా కొలిచే అత్యంత పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో గా బీసీ వ్యక్తి శ్యామలారావును నియమించడం హర్షణీయం అని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఎన్డీయే ప్రభుత్వం మున్ముందు బీసీలకు మేలు చేకూర్చే పథకాలు మరిన్ని ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# చంద్రబాబు నేతృత్వంలో బీసీలకు అందలం

- సీఎస్ గా బీసీ బిడ్డ విజయానంద్ నియామకంపై మంత్రి సవిత హర్షం



**అమరావతి,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** బీసీల పట్ల నిబద్ధతను సీఎం చంద్రబాబునాయుడును మరోసారి చాటుకున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. నూతన సీఎస్ గా బీసీ బిడ్డ విజయానంద్ ను నియమించినందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ ఆవిర్భావ నుంచి బీసీలకు పెద్దపీట వేస్తూ వస్తోందన్నారు. అన్న ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు...బడుగు బలహీన వర్గాల వారిని రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తూ వస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విజయానంద్ కు సీఎం చంద్రబాబుకు అవకాశమిచ్చారన్నారు. ఏపీ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఓ బీసీ అధికారి సీఎస్ నియమితులవ్వడం గర్వంగా ఉందన్నారు. బీసీ బిడ్డకు కీలకమైన బాధ్యతలు అప్పగించినందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

**బీసీలకు కీలక బాధ్యతలు..** చంద్రబాబు నాయకత్వంలో బీసీ నేతలకు, అధికారులకు ఎప్పుడూ సమున్నత గౌరవం లభిస్తోందని మంత్రి సవిత తెలిపారు. తన కేబినెట్ లో మంత్రులుగా ఎనిమిది మందికి అవకాశమిచ్చారన్నారు. మరో బీసీ సీనియర్ నేత చింతకాలయ అయ్యన్న పాత్రుడిని శాసన సభ స్పీకర్ గా నియమించారన్నారు. కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కేంద్ర మంత్రిగా అవకాశమిచ్చారన్నారు. తెలుగుదేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా బీసీ నేత పల్లా శ్రీనివాస్ నిమియతుల య్యారన్నారు. సీఎస్ తోపాటు డీజీపీ ద్వారకా తిరుమలరావు, టీటీడీ చైర్మన్ శ్యామలరావు కూడా బీసీలు కావడం గర్వకారణమన్నారు. అయిదేళ్ల జగన్ పాలనలో ఏనాడూ బీసీలను పట్టించుకున్న పాపానలోలేదన్నారు. కీలకమైన పదవులన్నీ ఒకే సామాజిక వర్గానికి కట్టబెట్టారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు బడుగు బలహీన వర్గాల వారిని రాజ్యాధికారంలో భాగస్వాములు చేస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు.

# నూతన ఒరవడితో నిర్మాణాత్మక అభివృద్ధి

- స్వర్ణాంధ్ర ఏ 2047 ప్రణాళికల అమలుపై ప్రత్యేక దృష్టి
- అన్ని రంగాల్లో 15 శాతం సగటు వృద్ధి సాధనకు చర్యలు
- టూరిజం హబ్‌గా జిల్లాను తీర్చిదిద్దేందుకు కసరత్తు
- కొత్త టూరిజం ప్యాకేజీ రూపకల్పనకు భాగస్వామ్య పక్షాలతో చర్చలు
- పారిశ్రామిక వృద్ధికి, ఉపాధి సృష్టికి వీలుకల్పించే ఎంఎస్ఎంఈ అభివృద్ధికీ చర్యలు
- సమష్టి భాగస్వామ్యంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** కొత్త సంవత్సరంలో నూతన ఒరవడితో నిర్మాణాత్మక అభివృద్ధికి చేసే కృషిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, సమష్టి భాగస్వామ్యంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ వీసీ హాల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి కొత్త సంవత్సరంలో చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం కీలక భాగస్వామ్యంతో బుడమేరు వరదల సమయంలో చేసిన కృషి మంచి ఫలితాలు ఇచ్చిందని.. సహాయ చర్యలతో పాటు ఆర్థిక సహాయ పంపిణీ వరకు బాధితులకు అండగా నిలవడంలో విజయవంతమయ్యామని పేర్కొన్నారు. ఇదేవిధంగా కొత్త సంవత్సరంలో సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని చేరుకునేందుకు టీమ్ ఎన్‌టీఆర్ కృషిచేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి మార్గనిర్దేశంతో రూపొందించిన స్వర్ణాంధ్ర ఏ 2047 ప్రణాళికల అమలుపై ప్రత్యేక దృష్టిపెడుతున్నామని, 15 శాతం సగటు వృద్ధికి ఇప్పటికే అధికారులను సన్నద్ధం చేసినట్లు వివరించారు. పారిశ్రామిక వృద్ధితో పాటు పెద్దఎత్తున ఉపాధి సృష్టికి వీలుకల్పించే ఎంఎస్ఎంఈ రంగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సేవా రంగం వృద్ధిలో భాగంగా జిల్లాను టూరిజం హబ్‌గా మార్చేందుకు కృషిచేస్తున్నామని.. కొత్త టూరిజం ప్యాకేజీ రూపకల్పనకు భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. పర్యాటక గైడ్లు ఏర్పాటు వంటి ప్రయోగాత్మక కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. నవ రాజధాని అమరావతికి ముఖద్వారమైన విజయవాడను పరిశుభ్ర, హరిత, సమృద్ధి నగరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు వివరించారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, ఎన్‌జీవోలు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ల ప్రతినిధులు తదితరుల సూచనలు, ఫీడ్‌బ్యాక్ తీసుకునేందుకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

**సంక్షేమం, అభివృద్ధికీ సమ ప్రాధాన్యం:** ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు శూన్య పేదరికం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధికీ సమ ప్రాధాన్యమిస్తున్నామని.. కొత్త వత్సరంలోనూ ఇదే పంథా కొనసాగిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పథకాల ప్రయోజనం తప్పక అందుతుందని స్పష్టం చేశారు. డబ్బు ఆదాతోపాటు ప్రతి ఒక్కరినీ పునరుత్పాదక ఇంధన వినియోగం దిశగా నడిపించేందుకు పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని కొత్త సంవత్సరంలో మరింత సమర్థవంతంగా అమలుచేసేందుకు కృషిచేయనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపే దిశగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ప్రతి జిల్లా అధికారినీ నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తి ప్రధానమ పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధికి ఉపాధి కల్పనను అనుసంధానం చేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ద్వారా మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు కృషిచేస్తున్నామన్నారు. మీడియా నిర్మాణాత్మక సూచనలు చేస్తూ జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం అందించాలని కలెక్టర్ లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు.

# తిరుమల దర్శనం... తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు చంద్రబాబు అంగీకారం

**అమరావతి,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు సంబంధించి ఏపీ సీఎం చంద్రబాబుతో తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ (టీటీడీ) బీఆర్ నాయుడు సమావేశమయ్యారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సులను కూడా అంగీకరించాలని ఇటీవల తెలంగాణకు చెందిన పలువురు నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీటీడీ చైర్మన్... ఏపీ సీఎంతో సమావేశమయ్యారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖపై చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. వారానికి నాలుగు సిఫార్సు లేఖలకు చంద్రబాబు అంగీకారం తెలిపారు. రెండు బ్రేక్ దర్శనం, రెండు రూ.300 దర్శనానికి సంబంధించిన లేఖలను అనుమతించేందుకు సీఎం అంగీకరించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల సిఫార్సు లేఖలను అంగీకరించాలని నిర్ణయించారు.

# బీసీల పక్షపాతి సిఎం చంద్రబాబు

● సీఎస్ గా విజయానంద్ నియామకంపై మంత్రి సుభాష్ హర్షం



**రామచంద్రపురం, డిసెంబర్ 30 (వార్తాప్రభ)** : రాష్ట్రంలో బీసీల పట్ల తనకున్న నిబద్ధతను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి చాటుకున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి (సీఎస్) గా బీసీ సామాజిక వర్గానికి చెందిన విజయానంద్ ను నియమించినందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సుభాష్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని సి ఎస్ గా నియమించడం గర్వకారణమన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు పెద్దపీట వేస్తూ వస్తోందన్నారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, అందరి అన్నగా పిలుచుకునే స్వర్గీయ నందమూరి తారక రామారావు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బడుగు, బలహీన వర్గాల వారిని రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తూ వస్తున్నారన్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విజయానంద్ కు సీఎం చంద్రబాబు అవకాశమిచ్చారన్నారు. బీసీ బిడ్డకు కీలకమైన బాధ్యతలు అప్పగించినందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సుభాష్ ధన్యవాదాలు తెలిపారు.సీఎం చంద్రబాబునాయుడు బడుగు బలహీన వర్గాల వారిని రాజ్యాధికారంలో భాగస్వాములు చేస్తున్నారని మంత్రి సుభాష్ కొనియాడారు. కీలకమైన పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తూ శాసనసభ స్పీకర్, డిజిపి,టిటిడి చైర్మన్ , పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రివర్గంలోనూ స్థానం కల్పించిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకి దక్కుతుందని మంత్రి సుభాష్ కృతజ్ఞతలు తెలిపారు.జగన్ ఐదేళ్ల పాలనలో బీసీలను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# పెడన మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



**పెడన,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** మండల ఆర్యవైశ్య సంఘం సమావేశం స్థానిక శ్రీ వాసవి ప్రార్థన మందిరం నందు జరిగినది.ఈ సమావేశమునకు కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగసాయి పాల్గొని స్థానిక శ్రీ వాసవి క్షేత్రంలోని శ్రీ వాసవి మాతను దర్శించుకుని స్థానిక శ్రీ వాసవి ప్రార్థన మందిరంలోని అమరజీవి పొట్టి శ్రీరాములు మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్న అధ్యక్షత వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సమావేశంలో పెడన మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షునిగా దేసు శ్రీనివాస్ గౌరవాధ్యక్షులుగా కొత్త ఫణిభూషణరావు కార్యనిర్వాహక అధ్యక్షునిగా జల్లూరి చిట్టి కోటయ్య ఉపాధ్యక్షులుగా మామిడి సత్యనారాయణ ప్రధాన కార్యదర్శిగా ఎందురి లక్ష్మీకాంతరావు కార్యదర్శిగా పద్మనాభుని వెంకటేశ్వరరావు కోశాధికారిగా కొల్లిపర నాగేశ్వరరావు తదితరులను కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగ సాయి పి ఆర్ ఓ చెక్క ఆంజనేయులు ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్ విద్య వైద్య కమిటీ చైర్మన్ మామిడి వెంకట వరప్రసాద్ రావు బందరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పద్మనాభుని నరసింహ మూర్తి (శేఖర్) గుడ్లవల్లేరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మురళి జిల్లావాసవి సేవాదళ్ నాయకులు పొట్టా హరిగోపాల్ తదితరుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్న తెలియజేశారు.ఈ సందర్భంగా కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగ సాయి, విద్య వైద్య కమిటీ చైర్మన్ మామిడి వెంకట వరప్రసాద్ రావు పెడన మండల ఆర్యవైశ్య సంఘానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం నిర్వహించి నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కమిటీ ఎంతో బాధ్యతగా సమర్థవంతంగా సంఘ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్న మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన పెడన మండల ఆర్యవైశ్య సంఘం వారు ఏ కార్యక్రమం చేపట్టినను తమ పూర్తి సహాయ సహకారములు అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం మండల ఆర్యవైశ్య సంఘం శ్రీ వాసవి మహిళా మండలి తదితర స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొని నూతనంగా ఎంపికైన పెడన మండల ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులను పుష్పగుచ్ఛం ఇచ్చి కండువాతో సత్కరించి అభినందించారు.

# ప్రపంచ తెలుగు మహాసభలకు పురిటిగడ్డ హైస్కూలు ప్లస్ విద్యార్థులు



**మచిలీపట్నం,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** విజయవాడ లోని కె బి యన్ కళాశాలలో జరుగుతున్న 6వ ప్రపంచ తెలుగు మహాసభలకు పురిటిగడ్డ హైస్కూలు ప్లస్ విద్యార్థులు పాల్గొన్నారు. 28.29 వ తేదీలలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో ఈ సారి యువతకు పెద్దపీట వేశాయి.'నేటి యువతయే రేపటి భవిత' అన్న విధంగా తెలుగు భాష పట్ల యువతకి ఆసక్తిని కలిగించి వారిలో వ్యక్తీకరణ సామర్థ్యం,సృజనాత్మక పెంచాలనే ఉద్దేశంతో వచన,పద్య,వ్యాస, అవధాన,గేయ,గజల్ రచనలపట్ల వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పురిటిగడ్డ హైస్కూలు ప్లస్ విద్యార్థులు పదిమంది పేర్లు నమోదు చేసుకుని తెలుగు భాషలోని కొన్ని రచనా ప్రక్రియలపై శిక్షణ పొందారు. పద్మభూషణ్ పి టి జి వి రంగాచార్యులు,డా రావిరంగారావు,అవధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాదు,సాధనాల వెంకటస్వామి నాయుడు,యస్ వెంకటేశ్వరరావు,కె మాధవరావు మొదలగువారు శిక్షణ ఇచ్చారు. వారి తరగతులు విన్న విద్యార్థులు సొంతగా రచనలు చేయగా, ఆ రచనలు దిద్దిన శిక్షకులు కొన్ని సూచనలు చేశారు. వెంకట గణేష్ తొమ్మిదవతరగతి,కె తేజస్విని పదవతరగతి ,కె గుణశ్రీ ఇంటరు,మొదటి కవితకే అభినందనలు అందుకున్నారు. ప్రశంసాపత్రం, మొమెంటో, నోట్సు, పెన్ను, సభలవివరాల పుస్తకం తోకూడిన బ్యాగును విద్యార్థులకు,వెళ్ళినప్రతినిధులకు నిర్వాహకులు అందజేశారు. తొమ్మిదవతరగతి లోని వెంకట గణేష్,హేమ చరణ్ ,పదవతరగతి లోని ఆర్ కీర్తి,కీర్తన,యశస్విని,ఇంటరు మొదటిసంవత్సరంలోని జి అంజలి,యమ్ మేఘన,ఇంటరు ద్వితీయ సంవత్సరంలోని కె గుణశ్రీ,పి పూజితలక్ష్మి,బి నవ్యలు పాల్గొన్నారు.తెలుగుభాష లో రచనలపట్ల ఆసక్తి ,మమకారం ఏర్పడ్డాయని,తాము పద్యాలు, కవితలు,కథలు,గేయాలు రాయగలమన్న నమ్మకాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా తెలుగు మహాసభలకు తీసుకువెళ్ళిన తెలుగు అధ్యాపకురాలు డా ఓలేటి ఉమాసరస్వతిని,శిక్షణ పొందివచ్చిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె బి యన్ శర్మ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందించారు.

# నూతన సంవత్సరం మరియు సంక్రాంతి కానుకగా 30% మధ్యంతర భృతి ప్రకటించాలి..

● డెమొక్రటిక్ పి ఆర్ టి యు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి...




**విజయవాడ,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** నూతన సంవత్సరం మరియు సంక్రాంతి దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము 30% మధ్యంతర భృతి డి.ఏ బకాయిలు పి.ఎఫ్ ఏ.పీ.జి.ఎల్.ఐ సరెండర్ లీవ్ చెల్లింపులు సత్వరమే జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సాయంత్రం జరిగిన డెమొక్రటిక్ పి ఆర్ టి యు జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి.శ్రీను మాట్లాడుతూ రాష్ట్రంలో నియమిత అడ్మిషన్స్ కలిగిన హై స్కూల్ ప్లస్ టూ లను కొనసాగించాలని.. ప్లస్ టూ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు జీ.వీ.ఎస్ పెరుమాళ్లు మాట్లాడుతూ అన్ని క్యాడర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నున్న రాంబాబు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన 8 మండలాలు ఏలూరు జిల్లాలో విలీనం చేయబడ్డాయని ఆయా మండలాల ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని సింగిల్ టీచర్ వ్యవస్థ లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్టియు నాయకులు. డి సత్యనారాయణ. జి పోతురాజు బి పాండు. పి వెంకటేశ్వరరావు. బి గోపయ్య వివిధ మండలాల బాధ్యులు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఏ. పి.నుంచి పేపర్ ప్రెజెంటేషన్లో పాల్గొన్న ఏకైక అధ్యాపకురాలు డాక్టర్ పామర్తి లీలావతి




**పాటియాలా,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** పాటియాలాలోని పంజాబ్ యూనివర్సిటీ లో జరుగుతున్న ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 83 వ సదస్సు లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకైక అధ్యాపకురాలు హాజరు కావడం విశేషం. విదేశీ చరిత్ర విభాగం లో విజయవాడ పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల చరిత్ర అధ్యాపకురాలు డాక్టర్ పామర్తి లీలావతి పేపర్ సమర్పించారు. ఇండియా – ఇండోనేషియాల మధ్యగల వస్త్ర వాణిజ్యం (పటోలశిల్క్ ప్రత్యేకంగా ) అంశంపై పేపర్ ను వివరించారు. ఓపెన్ డిస్కషన్ జరిగిన అనంతరం పేపర్ ను ఆమోదించిన సెక్షన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ శ్రీనాథ్ సర్టిఫికెట్ అందించి, అభినందనలు తెలిపారు. విభిన్న అంశాలను అధ్యయనం చేసి కొత్త కొత్త అంశాలను వెలికి తీయాలని అభిలషించారు. దేశ విదేశాల నుంచి హాజరైన సభ్యులు డాక్టర్ లీలావతి ని అభినందించారు.ఈ విభాగం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి కేవలం డాక్టర్ లీలావతి మాత్రమే పాల్గొనడం విశేషమన్నారు. ఈమె ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాయకాపురం, విజయవాడ నందు చరిత్ర అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు.

# భద్రతకు అధిక ప్రాధాన్యత

● జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ● 2024 వార్షిక నివేదిక విడుదల



**కాకినాడ, డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** జిల్లాలో ఉన్న ప్రజల భద్రతకు, వారి రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడం మంచి శుభ పరిణామని ఆయన చెప్పారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కాకినాడ జిల్లా పోలీస్ పనితీరు, చేపట్టిన అంశాలు, కేసుల వివరాల వార్షిక ప్రణాళికను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోక్సో చట్టంపై అవగాహన ఇచ్చామని అలాగే జిల్లాలోని పాఠశాలల్లో గుడ్, బ్యాడ్ టచ్ వంటి వాటిపై వివరించామన్నారు. జిల్లాలో మహిళా రక్షణకు 35 టీములు 1లక్షా 26 వేల మందికి పైగా అవగాహన చేసామన్నారు. ఎస్సీ ఎస్టీలు పై 2023లో 52 కేసులు నమోదవ్వగా ఈ ఏడాది 65 కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేసామన్నారు. గతేడాది జరిగిన ఆయా రోడ్డు ప్రమాదాల్లో 36 మంది మరణించగా ఈ ఏడాది 295 మంది మృతి చెందారన్నారు. ప్రమాదానికి కారణమైన చోట రక్షణ చర్యలు తీసుకున్నామని అక్కడ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. 2023లో తాగి వాహనం నడిపిన 5805 మందికి అపరాధ రుసుం విధించగా ఈ ఏడాది 7879 మందికి అపరాధ రుసుము విధించామన్నారు. సైబర్ క్రైమ్ ద్వారా 2023లో 8.32 కోట్లు నష్టం పోగా ఈ ఏడాది 26.57 కోట్లను పోగొట్టుకున్నారన్నారు. గంజాయి, డ్రగ్స్ కేసులకు సంబంధించి 1337 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని 87 మందిని అరెస్ట్ చేసి వీటి జోలికి పోకుండా విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి స్టేషన్కి ఒక డ్రోన్ కెమెరా ఏర్పాటు చేయాలనుకుంటున్నామని వెల్లడించారు. అపార్ట్మెంట్ యజమానులు సీసీ కెమెరాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని తద్వారా దొంగతనాలు, నేరాలు నిరోధానికి ఎంతో కీలకమవుతాయన్నారు. రానున్న నూతన సంవత్సర వేడుకలకు యువత మద్యం ఇతర వ్యసనాలకు దూరంగా ఉండి ఆనందంగా వేడుకలు చేసుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకాంక్షించారు.

# వారి పొరపాటు వీరి గ్రహ పాటు



**విస్సన్నపేట,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** జనాభా ప్రాతిపదికన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఎస్సీలను ఏబిసిడిలుగా విభజించే కార్యక్రమంలో ప్రభుత్వం వన్ మ్యాన్ కమిషన్ ను ఏర్పాటు చేయటం జరిగిందని మాజీ సర్పంచ్ పల్లిపాం లక్ష్మయ్య మీడియా సమావేశంలో తెలియజేశారు. ఆ ప్రక్రియలో భాగంగా 20 11 జనాభా ధామాషా ప్రకారం సచివాల యాల ద్వారా కుల గణన జాబితా డిస్ప్లే చేయడం జరిగిందని చెప్పారు. దళిత లీడర్లు కొంతమందిని క్రిస్టియన్లుగా మాదిగలను మాలలుగా మరికొందరిని ఇతర కులాలుగా తప్పులు తడకగా చూపించడం జరిగిందని ఈ విషయమై ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి కి ఫిర్యాదు చేయడం జరిగిందని చెప్పారు. ఈ విషయమై మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి ని వివరణ అడగక ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని క్షేత్రస్థాయిలో అణువణువు ఎంక్వయిరీ చేస్తామన్నారు.

# టెన్త్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి- శుభం నోఖ్వాల్

● కవులూరులో జెడ్పి పాఠశాలను సందర్శించిన ట్రైనీ కలెక్టర్





**జి.కొండూరు,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** ఈసారి పదో తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మరియు జి.కొండూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి(స్వతంత్ర హోదా) శుభం నోఖ్వాల్ అన్నారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ ఎస్) నిర్వహించిన అనంతరం ఆయన ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, ఎంపిడివో బి.వి.రామకృష్ణ నాయక్, మండల విద్యాశాఖ అధికారులు–1 పి.వి నరసింహారావు లతో కలిసి మండలం లోని కవులూరు గ్రామ శివారు బోగినేని రాజగోపాలరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు.టెన్త్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టెన్త్ లో ఏయే సబ్జెక్టులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు.బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు.అనంతరం టాయిలెట్స్ ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ వెంట రెండో మండల విద్యాశాఖ అధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళా లో వివిధ ఉద్యోగాలకు13 మంది ఎంపిక




**మైలవరం,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (APSSDC), జిల్లా ఉపాధి కల్పన శాఖ,కళాశాల సంయుక్తాధ్వర్యంలో సోమవారం "జాబ్ మేళ " నిర్వహించినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు (FAC), జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు మరియు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఇళ్ల రవి తెలియజేశారు. ఈ జాబ్ మేళ లో ADEPT, TECHNOTASK BUSINESS SOLUTIONS, INNOVSOURCE వంటి ప్రముఖ కంపెనీ ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ఇంటర్వ్యూకి మొత్తం 38 మంది హాజరు కాగా వారిలో 13 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వెల్లడించారు.మరో 08 మందికి తదుపరి ఇంటర్వ్యూ కండక్ట్ చేసి కంపెనీ ఆఫర్ లెటర్స్ అందజేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డా.ఎన్. వేంకటాద్రి, జి.నారాయణ రావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# "శ్రీ అగస్త్య"లో ఆనందోత్సాహాల మధ్య ఫుడ్ ఫెస్టివల్



**కాకినాడ,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** పసిపిల్లల కేరింతలు, ఉపాధ్యాయుల ఉద్బోధల మధ్య సోమవారం ఉదయం కాకినాడ శాంతినగర్ లోగల శ్రీ అగస్త్య వశిష్ట క్యాంపస్ లో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. శ్రీ అగస్త్య విద్యా సంస్థల డైరెక్టర్ డి.నాగేశ్వరరావు (డిఎన్ఆర్) సూచనల మేరకు ఈ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ ఫెస్టివల్ ను ప్రారంభించిన ఆ సంస్థ ఉద్యోగి, సీనియర్ పాత్రికేయులు అల్లుమల్లు ఏలియా మాట్లాడుతూ చిన్నతనం నుండే ఆహార అలవాట్లు, అలాగే షేరింగ్ అండ్ కేరింగ్ విధానం తెలుసుకునేందుకు ఇటువంటి ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మిలు మాట్లాడుతూ ఈ ఫుడ్ ఫెస్టివల్ ద్వారా విద్యార్థుల్లో ఆహారపు విలువలు, ఆహారాన్ని తీసుకునే విధానం, ఆహారం తీసుకోవడంలో తెలుసుకోవాల్సిన జాగ్రత్తలను నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ ఫెస్టివల్ ప్రతిష్టాత్మక రీతిలో నిర్వహించేందుకు సహకరించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ అగస్త్య ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు, మాథ్స్ ఫ్యాకల్టీ శ్రీ పల్లవి, ఏజీఎం జి.ఎస్ తో పాటు బోధన మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జెట్ స్పీడుతో టిడిపి సభ్యత్వాలు

● ఆర్యవైశ్య ప్రముఖులు ఏ శివ బాజీ



**విస్సన్నపేట,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో జట్టు స్పీడుతో టిడిపి సభ్యత్వ నమోదు జరుగుతున్నట్లు టిడిపి నాయకులు ఆర్యవైశ్య ప్రముఖులు అనుమోలు శివ బాజీ మీడియా సమావేశంలో తెలియజేశారు. 5 లక్షల రూపాయలు బీమా భరోసా సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్క కార్యకర్తకు అందుతోందని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ ముందుకు వెళుతున్న మన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తకు సభ్యత్వం కార్డ్ అందించే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో తిరువూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కుక్కడపు వెంకట నాగేశ్వరరావు, భువనేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలను పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలు జరుపుకోండి- ఎస్సై అనిల్



**వీరులపాడు,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** నిబంధనలు పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని వీరులపాడు మండలంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు డిసెంబర్ 31 తారీకు నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలని వీరులపాడు ఎస్ఐ అనిల్ కోరారు. వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు సైలెన్సర్లు తీసి వాహనం నడపరాదని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు., ఇతరలకు ఇబ్బందిగా కలగకుండా ప్రశాంతమైన వాతావరణంలో పండగలు జరుపుకోవాలని సూచించారు. 2025 నూతన సంవత్సరానికి స్వాగతిస్తూ ఎస్. ఐ.వీరులపాడు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# అన్నదానం కు 25 వేలు విరాళం..



**పెనుగంచిప్రోలు,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారిదేవస్థానం లో జరుగు నిత్య అన్నదానంకుపెనుగంచిప్రోలు కు చెందిన గింజుపల్లి కిషోర్ ధర్మపత్ని సౌజన్య శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానము అన్నదానమునకు రూ.25,000 (ఇరవై ఐదువేల రూపాయలు) విరాళంగా కార్యనిర్వహణధికారి భూపతి రాజు సత్య నాగ కిశోర్ కుమార్ కు అందజేశారు,వారికి దేవస్థానం తరుపున దర్శనం కల్పించి ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలు అందజేశారు.

# బొకేల తీసుకురాకండి.. నోట్ బుక్స్ ఇవ్వండి చాలు-ఎమ్మెల్యే కృష్ణప్రసాదు

● కూటమి నేతలు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేసిన శాసనసభ్యులు



**మైలవరం,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని తనను కలిసేందుకు వచ్చే కూటమి నాయకులు, కార్యకర్తలు బొకేలకు బదులుగా నోట్ బుక్స్, డిక్షనరీలు, లైబ్రరీ బుక్స్ ఇస్తే చాలా సంతోషిస్తానని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు సోమవారం తెలిపారు. తనను విష్ చేసేందుకు పుష్ప గుచ్ఛాలు, శాలువాలు, జ్ఞాపికలను తీసుకురావద్దన్నారు.తనపై ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలవడమే తనకు మరిచిపోలేని జ్ఞాపకమన్నారు. ఇకపై తనను కలిసేందుకు వచ్చేవారు ఏమీ తీసుకురాకపోయినా ఫర్వాలేదని,ఏదో ఒకటి ఫార్మాలిటీగా తీసుకురావాలనుకుంటే మాత్రం విద్యార్థులకు పనికొచ్చే నోట్ బుక్స్, డిక్షనరీలు, లైబ్రరీ బుక్స్ తీసుకొని రావాలని కోరారు.దయచేసి అందరూ ఈ విషయాన్ని గమనించాలన్నారు.

# సేవా మార్గదర్శి డాక్టర్ దుట్టా

● మానవత వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి



**హనుమాన్ జంక్షన్,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** మానవతా మూర్తి , పేద ప్రజల ఆపద్బాంధవుడు డాక్టర్ దుట్టా రామచంద్రరావు హనుమాన్ జంక్షన్ ఏలూరు రోడ్ లోని అప్పనవీడు గ్రామంలోని స్మశాన వాటికలో తన భార్య సీతా మహాలక్ష్మి జ్ఞాపకార్థం లక్ష రూపాయల వ్యయంతో శాంతి రథం షెడ్ నిర్మించి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కు సోమవారం ఉదయం ప్రారంభించి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎన్. రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ దుట్టా రామచంద్రరావు వంటి మహోన్నత వ్యక్తిత్వం కలిగిన వ్యక్తులు కోటికొక్కరు ఉంటారని కొనియాడారు. పేదలకు వైద్యం అందించేందుకు అహర్నిశలు శ్రమించి తన జీవితాన్ని త్యాగం చేసిన చేస్తున్న. ఆయన సేవా మార్గదర్శిగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు, గోసుల శివభరత్ రెడ్డి , దుట్టా రవి శంకర్ , దుట్టా శివన్నారాయణ, ఆలపాటి నాగేశ్వరరావు , సత్యన్నారాయణ, వేగిరెడ్డి సూర్య నారాయణ, గూడపాటి రామచంద్రరావు , నారగాని కొండలరావు, పాబోలు గణేష్ బాబు , జన్యావుల వీర వెంకట సత్యన్నారాయణ, వి.తుకారాం , కూరెళ్ళ సుబ్బాచారి , రేవిణిశెట్టి సూర్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు , దయాల ప్రభాకరరావు , చక్కా సుబ్బారావు , పి వి చలం , బాణాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## లింగయత్ సమాజ అభ్యున్నతికి కృషి చేసిన మహెూన్నత వ్యక్తి బసవేశ్వరుడు

### - ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**జగద్గిరిగుట్ట డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ జగద్గిరిగుట్ట పొలాల బస్తి నందు తెలంగాణ వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో పూజ గంగా మాతాజీ పర్యవేక్షణలో నిర్వహించిన 38వ బసవ జ్యోతి కార్యక్రమానికి ఆదివారం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సమాజంలో అన్ని మతాలు, కులాలు సమానమని, దేవుని దృష్టిలో అందరూ ఒకటేనని సమాజంలోని అసమానతలను తీవ్రంగా వ్యతిరేకించి లింగాయత్ సమాజ కృషిచేసిన మహెూన్నత వ్యక్తి బసవేశ్వరుడు అని అన్నారు. అనంతరం బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, నాయకులు నరసింహ, పాపులు గౌడ్, జైహింద్, విఠల్, దాసు, వీరశైవ లింగాయత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు దెంపే కృష్ణ, సంఘ సభ్యులు వీరయ్య స్వామి, సంజు, రన్ వీర్, బసవరాజ్, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

## షాపులను తొలగించొద్దని మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేత



**కుత్బుల్లాపూర్,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట డివిజన్, రాజీవ్ గృహకల్ప సముదాయానికి సంబందించిన సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో చిరు వ్యాపారులు తమ జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిన్న చిన్న వ్యాపార షాపులను తొలగించొద్దని సోమవారం గాజులరామారం సర్కిల్ మున్సిపల్ అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత 13 సంవత్సరాలుగా రాజీవ్ గృహకల్ప సముదాయానికి సంబంధించిన ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ కుటుంబాల నిరుపేదలు రాజీవ్ గృహకల్ప స్థలం సర్వేనెంబర్ 348/1 లో వార్డ్ కార్యాలయం పక్కన, మసీదుకు ఎదురుగా గల స్థలంలో తమ జీవనోపాధి కోసం చిన్న చిన్న వ్యాపార షాపులను (డబ్బాలు) ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. కాని ప్రస్తుతం జిహెచ్ఎంసి అధికారులు తమ షాపులను తొలగించి ప్రహరీ గోడ నిర్మించే ప్రయత్నం చేస్తున్నందున అట్టి పనులను వెంటనే నిలిపివేసి అట్టి స్థలాలను తమకే చెందేవిదంగా కేటాయించి తమ చిరు వ్యాపారాలను యెధావిధిగా కొనసాగించుకుని తమ జీవనాన్ని కొనసాగించుకునే విధంగా మునిసిపల్ అధికారులు సహకరించాలని, లేదంటే తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంటుందని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. అందుకు మున్సిపల్ అధికారులు సానుకూలంగా స్పందించి తప్పకుండా చిరువ్యాపారులకు న్యాయం జరిగేవిదంగా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ప్రజల మన్నలు పొందే విధంగా పోలీసులు విధులు నిర్వహించాలి

### డిఎస్పీ నల్లపు లింగయ్య



**నారాయణపేట డిసెంబర్ 30 (వార్తాప్రభ)** వార్షిక తనిఖీల్లో భాగంగా నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన డీఎస్పీపోలీసులు విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు మరింత చేరువ అయ్యేలా, ప్రజల మన్ననలు పొందే విధంగా పోలీస్ విధులు నిర్వర్తించాలని డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. ఈరోజు వార్షిక తనిఖీ లో భాగంగా నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. మొదటగా పోలీస్ సిబ్బంది పరేడ్ ను పరిశీలించారు. అందరు పరేడ్ పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బంది కిట్ ఆర్టికల్స్ ని పరిశీలించారు. ఉద్యోగం చెరే సమయంలో ఇచ్చిన కిట్ ఆర్టికల్స్ అన్ని జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బంది తో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా గా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమన్నా సమస్యలు ఉంటే ఎస్పీ దృష్టిలో ఉంచి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు ప్రజా సమస్యలపై వచ్చే బాధితులకు భరోసా కల్పించాలని వారి ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ సత్వర న్యాయం అందే విధంగా బరోసా కల్పించాలని తెలిపారు. ప్రజలు ఎవరైనా ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్ ని సంప్రదించవచ్చు అని లేదా డయల్ 100 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పెండింగ్ లో ఉన్న కేసుల గురించి, మరియు పెండింగ్ ఉన్న కేసులపై రివ్యూ చేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ ల పరిధిలోని కేసుల నమోదు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలని అడిగి తెలుసుకున్నారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని తెలిపారు. ఆకస్మికంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలని, ప్రజలు మహిళల రక్షణ కొరకు విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. పాత నేరస్థుల పై నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు, ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరగాలపై వారు ప్రస్తుతం వినియోగిస్తున్న నూతన పద్ధతులపై మరియు సీసీ కెమెరాలు ఉపయోగం వివరించి వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# 2024లో నేరాల రేటు తగ్గుముఖం!!

- సమిష్టి కృషితో క్రైమ్ రేట్ క్షీణింపు
- నిత్యం పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు
- బాధ్యత, సత్ప్రవర్తనతో నేరాలు అదుపులో
- సైబర్ క్రైమ్ నేరాల పట్ల ప్రత్యేక ప్రణాళికలు
- అత్యాధునిక టెక్నాలజీతో నేరాల పరిశోధన
- రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాస్





**పెద్దపల్లి/ రామగుండం: డిసెంబర్ 30 (వార్తాప్రభ ప్రతినిధి)** 2023 సంవత్సరంతో పోలిస్తే 2024లో నేరాల రేటు తగ్గుముఖం పట్టింది అని తెలిపారు రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాస్. ఈ వేరకు సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో వార్షిక నేరాల గణాంక నివేదిక విడుదల చేశారు సీపీ. ఈ సందర్భంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అన్యువల్ క్రైమ్ రిపోర్ట్ వివరించారు పోలీస్ కమిషనర్. సమిష్టి కృషితో క్రైమ్ రేట్ క్షీణింపు సాధ్యం అయినదని తెలిపారు. నిత్యం పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు చేపట్టడం వలన ప్రజల్లో మార్పుతో నేరాలను అదుపు చేయవచ్చని తెలిపారు. బాధ్యత, సత్ప్రవర్తనతో నేరాల సంఖ్య తగ్గుముఖం పడుతుందని అన్నారు. మహిళలు, పిల్లల భద్రతకు ఎంతగానో ప్రాముఖ్యం కల్పించామని అన్నారు. బాధితులకు న్యాయం కలుగుతుందనే నమ్మకం కల్పించామని తెలిపారు. కమిషనరేట్ వ్యాప్తంగా పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలలో టెక్నాలజీని వినియోగిస్తూ క్రైమ్ కంట్రోల్ చేస్తున్నట్లు తెలిపారు. గంజాయిపై ఉక్కు పాదం మోపుతున్నట్లు తెలిపారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి చేతన, మంచిర్యాల డిసిపి భాస్కర్, అడిషనల్ డిసిపి అడ్మిన్ రాజు, ఏసీపీలు రమేష్, నరసింహులు, ప్రతాప్, సుందర్ రావు, ఆర్ఐలు దామోదర్, మల్లేష్ పాల్గొన్నారు.

# "విక్టరీ" ప్రథమం... పోటీ ఏదైనా!!

- రాష్ట్రీయ, జాతీయ స్థాయిలో రాణిస్తున్న విక్టరీ షోటోకాన్
- ఫోకస్ విక్టరీపై ఉంటే మెడల్స్ సాధ్యం
- షోటోకాన్ కరాటే స్కూల్ టెక్నికల్ డైరెక్టర్ ఒడ్డేపల్లి సురేష్

**పెద్దపల్లి/ గోదావరిఖని: డిసెంబర్ 30 (వార్తాప్రభ ప్రతినిధి)**"విక్టరీ" ప్రథమం... పోటీ ఏదైనా అని నిరూపిస్తున్నారు విక్టరీ షోటోకాన్ కరాటే స్కూల్ విద్యార్థులు. తాజాగా ఆదివారం బెల్లంపల్లిలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీలలో కటాస్ విభాగంలో వేదాన్షి, సమన్విత, దేవాన్ష్, అక్షిత్ రామ్, అభిజయ, అనీష్ విహాన్ ప్రథమ స్థానం విజేతలుగా, సాయి చరణ్, లిఖిత్, లాస్య, మన్మాయి శ్రీ, మోక్షజ్ఞ ద్వితీయ స్థానం విజేతలుగా, హాసిని, జస్వంత్, శశ్రిత్, అబ్బాస్, యశికలు తృతీయ స్థానం విజేతలుగా మెడల్స్ సాధించినట్లు వివరాలను వెల్లడించారు ఆ కరాటే స్కూల్ టెక్నికల్ డైరెక్టర్ ఒడ్డేపల్లి సురేష్. కరాటే మాస్టర్ రాము పర్యవేక్షణలో పాల్గొని విజేతలుగా నిలిచిన వారిని బచ్ పన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ శ్రీధర్, పిఈఎఫ్ఐ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ తగరపు శంకర్ అభినందించారు.




# ఎట్టకేలకు కార్మిక సంఘంలో గుర్తింపు!!

**కష్టానికి ప్రతీకగా జీడీకే11వ గని పిట్ సెక్రటరీ పదవి**

**కార్మిక సంఘం నాయకుడిగా ఎదిగిన విద్యార్థి సంఘం లీడర్**

**వాసర్లో జోసెఫ్ ఎన్నిక పట్ల "టీబీజీకేఎస్ యూనియన్"లో హర్షాతిరేకాలు**



**పెద్దపల్లి/ గోదావరిఖని: డిసెంబర్ 30 (వార్తాప్రభ ప్రతినిధి)**ఎట్టకేలకు కార్మిక సంఘంలో గుర్తింపు లభించినది నాటి తెలంగాణ విద్యార్థి సంఘంలో కీలక నాయకుని పాత్ర పోషించిన నేటి సింగరేణి కార్మికుడు వాసర్ల జోసెఫ్. ఈ మేరకు సోమవారం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి రామగుండం ఏరియా వన్ జిడికె 11 ఇంక్లైన్ భూగర్భ గని పిట్ సెక్రటరీగా ఎన్నిక చేస్తూ ఉత్తర్వు పత్రాలను అందజేశారు. జోసెఫ్ ఎన్నిక పట్ల ఆ సంఘంలో హర్షాతి రేఖాలు వ్యక్తం అవుతున్నాయి. నాడు విద్యార్థుల సమస్యలపై, తెలంగాణ ఉద్యమంలో సైతం అలుపెరుగని పోరాటం చేసిన నాయకుడు నేడు సింగరేణి కార్మికుడిగా సైతం టీబీజీకేఎస్ లో కీలక పాత్ర పోషిస్తున్నందున ఆ పదవికి ఎంపిక చేయడం శుభ సూచకమని, కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి యాజమాన్యానికి తెలియజేయడానికి అతను నూటికి నూరు శాతం తగినవారు అని పలువురు ప్రశంసించడం కొసమెరుపు. అభినందన కార్యక్రమంలో కార్మిక నాయకులు మాదాసు రామ్మూర్తి, నూనె కొమరయ్య, పర్లపెల్లి రవీందర్, వడ్డేపల్లి శంకర్, మోదుంపల్లి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 31న ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు

- జిల్లాలో 2,30,619 పెన్షన్లకు రూ. 98.19 కోట్లు విడుదల
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, డిసెంబర్ 30 (వార్తాప్రభ ప్రతినిధి)**రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక రోజు ముందే ఈ నెల 31వ తేదీ మంగళవారం 100 శాతం పెన్షన్ల పంపిణీకి అధికారులు, సిబ్బంది కృషిచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్‌డీఏ పీడీ, ఆర్‌డీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పెన్షన్ల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసేలా దిశానిర్దేశం చేశారు. ఏవైనా చిన్నచిన్న సమస్యలుంటే వెంటనే సరిదిద్ది ఉదయం ఆరు గంటల నుంచే పెన్షన్ల పంపిణీని ప్రారంభించాలని.. జిల్లాలో 2,30,619 పెన్షన్లకు రూ. 98.19 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. టెలీకాన్ఫరెన్స్‌లో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



## నూతనంగా వితంతువులకు పింఛన్లు మంజూరు - రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి: డిసెంబర్ 30 (వార్తాప్రభ ప్రతినిధి)** ఎన్టీఆర్ భరోసా పథకం కింద అందించే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సరళీకృతం చేసిందని రాష్ట్ర సూక్ష్మ చిన్న, మద్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారిక సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరేడు నెలలకు ఒకసారి కొత్తగా పింఛన్లు మంజూరు చేసే ధోరణికి స్వస్తి పలికామని అన్నారు. ఇప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే వెంటనే భార్యకు ఏ నెలకు ఆ నెలే పింఛను ఇచ్చే విధానాన్ని అమలులోకి తెచ్చామని తెలిపారు. దీన్నే స్పౌజ్ క్యాటగిరీగా గుర్తిస్తూ పింఛను మంజూరు చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గత నెల నవంబరు 1వ తేదీన శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా స్పౌజ్ క్యాటగిరీ కింద ఎప్పటికప్పుడు వితంతువులకు పింఛను మంజూరు చేస్తామని ప్రకటించారని, ఈ నెల నుంచి పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. అందులో భాగంగా 5,402 మందికి కొత్తగా ఫించన్లు ఇస్తున్నామని తెలిపారు. నవంబరు 1వ తేదీ నుంచి డిసెంబరు 15వ తేదీ వరకు కొత్తగా 5,402 మందికి వితంతువు (ఇప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త చనిపోయిన వారికి) క్యాటగిరీలో పింఛను మంజూరు చేశామన్నారు. వీరికి డిసెంబర్ 31వ తేదీన రూ.4 వేల చొప్పున పింఛను పంపిణీ చేయనున్నామని తెలిపారు. అలాగే గత మూడు నెలల వ్యవధిలో వివిధ రకాల కారణాలతో పింఛను తీసుకోని 50 వేల మందికి సైతం బకాయిలతో సహా అందించనున్నామని ఆయన అన్నారు. వీరికి రెండు, మూడు నెలల మొత్తాన్ని కలిపి ఒకేసారి డిసెంబరు 31వ తేదీన పంపిణీ చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ ప్రకటనలో తెలియజేశారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

## క్రీడల అభివృద్ధికి కృషి చేస్తా

**- తెలంగాణ ఒలంపిక్ సంఘ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన కొండ విజయ్ ను అభినందించిన ఎమ్మెల్యే గాంధీ**



**శేరిలింగంపల్లి,డిసెంబర్ 30 (వార్తాప్రభ):**తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గా నియామకం అయిన శుభసందర్భంగా కొండ విజయ్ పీఏసీ చైర్మన్ ఆరెకపూడి ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలవగా కొండ విజయ్ ని శాలవతో సత్కరించి,పుష్పగుచ్ఛం అందచేసి ప్రత్యేకంగా అభినదించిన పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధి తో పాటు,క్రీడాకారుల సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తున్న కొండ విజయ్ కి రానున్న రోజుల్లో మరిన్ని పదువులు పొందాలని ఆకాంక్షించారు. క్రీడల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని పీఏసీ చైర్మన్ గాంధీ తెలిపారు. సిఎం కప్ లో భాగంగా గచ్చిబౌలి స్టేడియం నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి గాంధీ ని ఆహ్వానించారు.

## సందర్శకులను ఆకట్టుకున్న చేనేత హస్తకళ ఉత్పత్తులు



**శేరిలింగంపల్లి,డిసెంబర్ 30 (వార్తాప్రభ):**మాదాపూర్ లోని శిల్పారామం లో అల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళ సందర్భంగా ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నవి. సోమవారం డాక్టర్ సత్యప్రియ రమణ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రార్ధన,సిద్ధి వినాయకం, పద్మావతి ప్రవేశం, బాల కనకమయ,పలుకే బంగారమయేహ్నా ,గోవర్ధన గిరిధారి,అయిగిరినందిని, ముద్దుగారే యశోద,తిల్లాన, మంగళం అంశాలను కామాక్షి, విజయ,నిఖిల,శ్రీయ,వకుళ, రమ్య,శ్రిష్టి మొదలైనవారు ప్రదర్శించారు. వైదేహి సుభాష్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలో సకలగణాధి,నటేశ కౌతం, మహిషాసుర మర్ధిని,మరకత,అంబాస్తుతి,బృందావన తిల్లాన అంశాలను సాత్విక,అన్వేష,గౌరి,కరుణ,ధనిష్ఠ,కృతి,లాస్య, మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## న్యూ మోడ్రన్ స్వీట్స్ అండ్ బేకరీ షాప్ ప్రారంభించిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**కుత్బుల్లాపూర్ డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ చింతల్



డివిజన్ రొడామిస్త్రీ నగర్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ మోడర్న్ స్వీట్ అండ్ బేకరి షాప్ ను ఆదివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ... శుభకార్యాలకు, పండుగలకు వినియోగదారులకు ప్రత్యేక రుచులను అందిస్తూ న్యూ మోడర్న్ స్వీట్స్ అండ్ బేకరీ షాప్ మంచి ఆదరణ పొందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ రఫీ, నాయకులు వాహీద్, న్యూ మోదరన్ స్వీట్స్ అండ్ బేకారి నిర్వాహకులు మొహమ్మద్ ఫారుక్, మొహమ్మద్ ఆరిఫ్, మొహమ్మద్ షాఫీ, మొహమ్మద్ రఫీ, మొహమ్మద్ బర్కత్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కుల చేతి వృత్తులకు చేయూత ఇవ్వాలి

**వేములవాడ, డిసెంబర్ 30: (వార్తాప్రభ),** తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులాలకు చెందిన కులచేతి వృత్తులు రోజు ,రోజుకు అంతరించి పోతున్నందున ,బీసీ కులాల జీవనోపాధి చాల కష్టంగా మారుచుండెను అని,బీసీ కులాల సంక్షేమం కొరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలవారికి ఆర్థిక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి,అట్టి కార్పొరేషన్లకు తగిన నిధులు కేటాయించాలని రాష్ట్ర సంఘం గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్, జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ అన్నారు. వేములవాడ ఉత్తర తెలంగాణ బీసీ సాధికారిత సంఘం కార్యాలయం లో జరిగిన సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బీసీల సంక్షేమం కొరకు గత ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను యధావిధిగా కొనసాగిస్తూ, ఇటీవల బీసీ కమీషన్ జిల్లాల వారీగా పర్యటించిన సందర్భంగా బీసీ సంఘాల వారు ఇచ్చిన వినతి పత్రాలను పరిశీలించి వాటన్నింటిని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీలు రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని,బీసీలు సీట్లు అడిగే స్థాయి నుండి,సీట్లు ఇచ్చే స్థాయికి ఎదుగాలని అన్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు చేసిన వాగ్దానాలనుఅమలుచేయాలని ,రాష్ట్ర జనాభాలో 50 శాతం పైబడిన బీసీ కులాలను విస్మరించవద్దని,బీసీ జనాభా ప్రాతిపదికపై రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని అన్నారు

# ఎడిటోరియల్

## జగన్ తో పాటే పవన్... పక్కా వ్యూహంతోనే !

ఏపీలో రాజకీయం గేరు మారుస్తోంది. ఆరు నెలలుగా కొంత స్తబ్దతగా ఉన్న పొలిటికల్ సీన్ వైసీపీ నిరసనలతో మళ్లీ మెల్లగా రూట్ లోకి వస్తోంది. ఇంకో వైపు ఏపీలో టీడీపీ కూటమి ఏర్పాటు అయిన తరువాత తొలి ఆరు నెలల కాలం ముగిసింది. హానీమూన్ పీరియడ్ కూడా పూర్తి అయింది. దాంతో ఇపుడు ప్రభుత్వం కూడా గ్రౌండ్ లెవెల్ రిపోర్టులను తెప్పించుకునే పనిలో పడింది. అదే విధంగా ఏపీలో ప్రజలు ఏమి అనుకుంటున్నారు. ప్రభుత్వం పని తీరు ఎలా ఉంది అన్నది కూడా ఎప్పటికప్పుడు తెలుసుకుంటోంది. ఈ నేపథ్యంలో చూస్తే కొత్త ఏడాది వస్తూనే వైసీపీ అధినేత జగన్ జనంలోకి వస్తాను అని చెబుతున్నారు. ఆయన జనవరి నెలాఖరులో ఏపీలో ఉన్న ఇరవై ఆరు జిల్లాలలో ఒక షెడ్యూల్ ప్రకారం పర్యటించనున్నారు. జిల్లాలో రెండు రోజులు వంతున జగన్ పర్యటన సాగనుంది. ఆ సమయంలో ఆయన జిల్లాలోనే బస చేస్తారు. ఆ విధంగా పార్టీని పటిష్టం చేసుకుంటూనే జనంతో మమేకం అయి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు జగన్ జనంలోకి రావాలని చూడడంతో టీడీపీ కూటమి ప్రభుత్వం కూడా అప్రమత్తం అవుతోంది. ఇక పవన్ కళ్యాణ్ సైతం జనంలోకి రావాలని చూస్తున్నారు. ఆయన కూడా ప్రతీ జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించేలా కార్యక్రమం సిద్ధం చేస్తున్నారు. జగన్ ఒక వైపు విపక్ష నేత హోదాలో వస్తుంటే ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కళ్యాణ్ పర్యటనలకు శ్రీకారం చుట్టడం పట్ల చర్చ సాగుతోంది. ఏపీలో వైసీపీని బలపడనీయకూడదు అన్న ఆలోచనతోనే ఇదంతా చేస్తున్నారా అన్నది కూడా చర్చిస్తున్నారు. ఏపీలో ఆరేడు నెలల కూటమి పాలన మీద జనంలో మిశ్రమ స్పందన ఉంది. దానికి కారణం సూపర్ సిక్స్ హామీలు నెరవేరలేదని దిగువ వర్గాలలో అసంతృప్తి ఉంది. ఉన్నత మధ్యతరగతి వర్గాలలో చూస్తే అభివృద్ధి ఇంకా మొదలు కాలేదని ఉంది. ఇక ఉద్యోగ వర్గాలలో చూస్తే తమకు కొత్త పీఆర్సీ మాట పక్కన పెట్టి ఇంటీరియం రిలీఫ్ ని ఇవ్వలేదని ఏడు నెలల కొత్త ప్రభుత్వం పాలనలో ఒక డీయే అయినా ఇవ్వలేదని అంటున్నారు నిరుద్యోగ యువత కొత్త పోస్టింగుల కోసం చూస్తోంది. డీఎస్సీ రిక్రూట్మెంట్ ఆలస్యం కావడం పోలీస్ రిక్రూట్మెంట్ విషయంలో నూ లేట్ కావడం వంటివి వారిలో కొంత కలవరం కలిగిస్తున్నాయి. అదే విధంగా నిత్యావసర ధరలు అధికంగా పెరగడం, దానికి తోడు అన్నట్లుగా విద్యుత్ చార్జీల పెంపు కూడా సగటు జనానికి ఇబ్బందిగా మారుతున్నాయి. దీంతో ప్రభుత్వం పట్ల ప్రస్తుతానికి అయితే సన్నగా అసంతృప్తి మొదలైంది. అది ఇంకా ఒక రూపం అయితే సంతరించుకోలేదు. వైసీపీ వైపుగా ఈ అసంతృప్తిని మళ్ళించుకోవాలని వైసీపీ అధినాయకత్వం వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. అయితే అంతవరకూ పరిస్థితి రానీయకుండా చూడాలని కూటమి పెద్దలు ఆలోచిస్తున్నారు. అందుకే చరిష్మాటిక్ లీడర్ గా ఉన్న పవన్ కళ్యాణ్ ని జనంలోకి వెళ్తున్నారు అని అంటున్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని ప్రభుత్వం అన్నింటినీ పరిష్కరిస్తుందని ప్రభుత్వ పెద్దగా భరోసా ఇచ్చేలా పవన్ పర్యటనలు ఉంటాయని అంటున్నారు. మరో వైపు చూస్తే ప్రభుత్వం ఆరు నెలలకే అన్ని విధాలుగా విఫలం అయింది అని జగన్ జనంలోకి రానున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా మరచిపోయారని ప్రభుత్వం ప్రజలకు రిక్త హస్తం చూపిస్తోందని ఆయన బిగ్ సౌండ్ చేయనున్నారు ఇలా రెండు విభిన్న వాదనలతో పవన్ జగన్ జనంలోకి కొత్త ఏడాది రానున్నారు అని అంటున్నారు. మరి జనాలు ఎవరి వైపు చూస్తారు, ఎవరి వాదన కరెక్ట్ అని ఆలోచిస్తారు అన్న దాని మీద 2025లో ఏపీ పాలిటిక్స్ ఆధారపడి ఉంటుందని అంటున్నారు. అదే సమయంలో ఏపీ పాలిటిక్స్ ని విపక్షం స్టీరింగ్ తిప్పి తన వైపు తీసుకోకుండా కూటమి తగిన ప్రణాళికతోనే ముందుకు సాగుతోంది అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## కొంగర మల్లయ్య గట్టు వద్ద ప్రమాదం



**జగ్గయ్యపేట డిసెంబర్ 30 (వార్తప్రభ)**వత్సవాయి మండలం నేషనల్ హైవే 65 టోల్ ప్లాజా సమీపంలో భీమవరం కొంగర మల్లయ్య గట్టు వద్ద భీమవరం నుండి జగ్గయ్యపేట వైపు బైక్ స్పీడ్ గా రావడంతో విజయవాడ నుండి వస్తున్న కారు బైక్ అతనిని తప్పించబోయి భీమవరం రోడ్డుకి కారును మరలచగా హైదరాబాద్ నుండి టోల్ గేట్ దాటి విజయవాడ రోడ్డులో గల ఆటోను తగలగా అదే వెనుక భాగాన గల కారు మరియు బైక్ ప్రమాదానికి గురైన్నాయి ఇద్దరు క్షతగాత్రులైన్నారు.వెంటనే అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు.ఇదే సమయంలో ఆర్.టి.ఓ వారు సమీపంలో దూరంలో ఉన్నప్పటికి ఇంత ఘటన జరిగటం దురదృష్టం అని.హైవే క్రాసింగ్ వల్ల భీమవరం గట్టు వద్ద ప్రమాదాలు తరచూ జరుగుతున్న అధికారులు సరైన స్పందన లేదని ప్రజలు కోరుతున్నారు.

## సూక్తి సుధ

బహు విలువైనది సమయము
సుతిమెత్తనిది హృదయము
జాగ్రత్తగా వాడాలి
కనుపాపలా చూడాలి
పువ్వులాంటి స్నేహము
చేయరాదు ద్రోహము
రోజా పూవు రీతిలో
రోజురోజూ పూయాలి
పవిత్రమైన బంధము
జీవితంలో అందము
పదిలంగా ఉండాలి
నదిలా ప్రవహించాలి
అంతరంగ సద్గుణము



అసలు సిసలు సౌందర్యము
సూర్యోదయమవ్వాలిజి
నందన వనం కావాలి

**గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు, 9966414580

# న్యూ ఇయర్ వేడుకల పై ఫోకస్ పెట్టిన పోలీసులు

- యువతకు సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ కీలక సూచనలు



**సంగం, డిసెంబర్ 30 (వార్తాప్రభ)**: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించిన సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు. నూతన సంవత్సరం రాబోతున్న సందర్భంగా జిల్లా ఎస్పీ గారి ఆదేశాలతో ఆత్మకూర్ డిఎస్పీ గారి సూచనలతో యువత వహించవలసిన జాగ్రత్త లను సూచించారు. రోడ్డుల మీద కేక్ లు కట్ చేయడం, బహిరంగ ప్రదేశాల్లో స్పీకర్ లు పెట్టడం చేయకూడదని, మద్యం తాగి బైకులు నడిపినా, ఇతరులకు అసౌకర్యం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. యువత నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణం లో చేసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో బైకులు,కార్లు రైడింగ్ లు చేస్తే కఠిన చర్యలు తప్పవు తెలిపారు. వేడుకల పేరుతో జాతీయ రహదారుల పై హంగామా లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువత పోలీస్ సూచనలు సలహాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

# ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేసిన విజయవాడ వెస్ట్ జోన్ ట్రాఫిక్ పోలీసులు

- ఇకపై హెల్మెట్ లేకుండా ప్రకాశం బ్యారేజ్ పైన ప్రవేశం ఉండదు
- అయ్యో పాపం ""అనుకొనే విధులకు" తిలోదకాలు ఇచ్చిన ట్రాఫిక్ పోలీసులు
- వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏ సి పి కార్యాలయం వద్ద జరిమానాలు చెల్లింపు కి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు
- ఆన్ లైన్ చలానా చెల్లింపు కు సచివాలయం మహిళా పోలీసులు తాత్కాలిక విధులు
- వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏ సి పి రామచంద్రరావు వెల్లడి

**యేమినేని వెంకట రమణ**



**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ వెస్ట్ జోన్ ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ లేకుంటే వాహనాలు నడిపే వారిని పూర్తి స్థాయిలో టార్గెట్ చేస్తున్నారు. అయ్యా బాబూ ఇదంతా మీ ప్రాణాలు కాపాడడానికే అని నయాన భయాన చెప్పినా ఎవ్వరూ వినడంలేదని గ్రహించిన పోలీసులు తప్పనిసరి పరిస్థితుల్లో కఠిన నిర్ణయాలు తీసుకున్నారు.ఇటీవల హై కోర్ట్ జారీ చేసిన ఆదేశాల మేరకు ఇక నుంచి ద్విచక్రవాహనాల్లో వచ్చే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సి ఉంటుంది. లేనట్లయితే సోమవారం నుండి హెల్మెట్ లేకుంటే వాహనాలు నడిపే వారికి ప్రకాశం బ్యారేజ్ పైన ప్రవేశం ఉండదని తేల్చి చెప్పేశారు. దానిలో భాగంగా సోమవారం ప్రకాశం బ్యారేజ్ పై పోలీసులు అష్టదిగ్బంధనం చేశారు. ఎడా పెడా కేసులు నమోదు చేసి జరిమానా లు విధించారు. కొంతకాలంగా రహదారులపై జరిగే ప్రమాదాలలో అత్యధికంగా ద్విచక్రవాహనాలే ప్రమాదానికి గురవుతున్నాయి. దీంతో ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడంతో అనేక మందికి తలకు గాయాలై ప్రాణాలు కోల్పోతున్నారనీ ఏ సి పి రామచంద్రరావు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు అందరూ హెల్మెట్ ను ధరించాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు.ఐతే పెండింగ్ లో ఉన్న చాలానాలు, ప్రస్తుతం చాలానాలు ట్రాఫిక్ పోలీసులు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఈ నెలాఖరు వారంలో సోమవారం నాటికి సుమారు 2500 మందికి జరిమానా విధించగా రూ 7 లక్షల 60 వేలు అపరాధ రుసుం వసూలు చేశామని ఏ సి పి ""వార్తా ప్రభ దినపత్రిక""ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రానున్న రోజుల్లో ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వినియోగం దాని ప్రయోజనం అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించడానికి తన పరిధిలో రంగం సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే పోలీసులు కేసులు నమోదు చెయ్యరు.అలాగే గ్రహపాటున రోడ్డు ప్రమాదం జరిగినా ప్రాణ నష్టం వాటిల్లదని ఏ సి పి వాహనాలు చోదకులు హితవు పలికారు.

# పిజిఆర్ఎస్ మండలాల్లో నిర్వహించాలి-డిఆర్ఓ



**మచిలిపట్నం డిసెంబర్ 30 (వార్తాప్రభ ప్రతినిధి)** డి ఆర్ వో కె చంద్రశేఖర రావు సోమవారం కలెక్టరేట్లో మీకోసం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డి ఆర్ ఓ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) చాలా ఎఫెక్టివ్ గా నిర్వహిస్తున్న మాదిరిగా మండలాల్లో కూడా నిర్వహించాలనే లక్ష్యంతో ఉన్నట్లు, ఇందులో భాగంగా ఈరోజు జిల్లా కలెక్టర్ పమిడిముక్కల ఆకస్మికంగా సందర్శించి మీకోసం నిర్వహణ పరిశీలించారన్నారు. జనవరి 3వ తేదీన రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ మచిలీపట్నం లేడీ యంప్తిల్ కళాశాలలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ గార్ల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే సందర్భంలో ప్రభుత్వ పాఠశాలల, హాస్టల్ల విద్యార్థులకు ఉపయోగపడే విధమైన నోట్ పుస్తకాలు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు వంటివి అందిస్తే బాగుంటుందని, జిల్లాలో ఈ సంవత్సరం వివిధ శాఖల సంక్షేమ హాస్టల్లో 1074 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని, వీరికి ఉపయోగపడే విధంగా ఎగ్జామ్ ప్యాడ్ కిట్స్ అందజేస్తే బాగుంటుందని అధికారులకు సూచించారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఈ విషయంలో సమన్వయం చేస్తారన్నారు.కలెక్టరేట్ ఆవరణలో ప్రహరీ గోడ వెంబడి లోపల వైపు మూడు అంచెలలో చెట్లు నాటాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారని, ఒక్కొక్క జిల్లా అధికారి ఒక్కొక్క చెట్టును నాటుటకు చొరవ చూపాలని సూచిస్తూ, నాటిన చెట్టు సంరక్షణ చూడవలసి ఉంటుందని, చెట్టు నాటిన అధికారి పేరుతో బోర్డు కూడా ఏర్పాటు చేయవచ్చని, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఈ విషయంలో సమన్వయం చేస్తారన్నారు. కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి శ్రీదేవి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం నుండి అందే గ్రీవెన్స్ ఎప్పటికప్పుడు ఆయా శాఖలకు పంపుతున్నట్లు, వీటిని పరిష్కరించాక అర్జీదారునికి జిల్లా కలెక్టర్ వారి సంతకంతో సరైన ఎండార్స్మెంట్ తో క్లోజ్ చేయవలసి ఉంటుందని చెప్పామని, కానీ కొంతమంది చివరి నిమిషంలో పంపుతున్నారని, గడువు దాటే పరిస్థితి ఏర్పడకుండా ముందుగా పంపాలన్నారు.

**మీకోసం అర్జీలలో..**బందరు టు బంటుమిల్లి ఆర్టీసీ బస్సు నారాయణపురం గ్రామం లోనికి రావడంలేదని, విద్యార్థులు సమయానికి బడికి వెళ్ళలేకపోతున్నారని, సమస్య పరిష్కరించాలని బంటుమిల్లి జడ్పీ స్కూల్ విద్యార్థులు అశ్విత తదితరులు మీకోసంలో అర్జీ సమర్పించారు. 1979 లో మాజీ సైనిక ఉద్యోగులకు నాగాయలంక మండలంలో ప్రభుత్వం ఇచ్చిన భూములు ఆక్రమణలు తొలగించి పట్టాలు ఇప్పించాలని కోరుతూ సిహెచ్. ఆశీర్వాదం తదితరులు మీకోసంలో అర్జీ సమర్పించారు.సివిల్ సప్లై డిఎం పద్మాదేవి, జడ్పీ సీఈవో కె. కన్నమ నాయుడు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జే.జ్యోతి, డి ఎం అండ్ హెచ్ వో డాక్టర్ శర్మిష్ట, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. పద్మావతి, పిడి డ్వామా శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు ఈక్రాప్ నమోదు చేయించుకోండి

**మండల వ్యవసాయశాఖ అధికారి వి.ప్రతాప్**



**కలువాయి డిసెంబర్ 30 (వార్తాప్రభ)** శ్రీరాములు నెల్లూరు జిల్లా కలువాయి వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారి ప్రతాప్ పాత్రికేయులతో మాట్లాడుతూ రైతులు పంటలకు ఈ క్రాప్ చేసుకోవాలని తెలిపారు. ప్రకృతిలో వచ్చే విపత్తుల వల్ల పంటలకు నష్టం కలిగితే ఈ క్రాఫ్ చేసుకోవడం వల్ల ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తుందని తెలిపారు.ముఖ్యం గా కలువాయి మండల కేంద్రము నందు రైతులు అందుబాటులో లేకపోవడం మా సిబ్బంది పలు మార్లు ఆ పొలాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇవ్వాలని కోరిన స్పందించకపో వడం వలన వారికి ఈ క్రాప్ చేయడం చాలా ఇబ్బందిగా ఉందని కనుక రైతులు స్పందించి తమ తమ సచివాలయాల్లో వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా మీ పంట నమోదు చేయించుకో వాలని అలా చేయించుకోవడం వలన ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలకు అర్హులు అవుతారని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## చీపినాపిలో పశు వైద్య శిబిరం నిర్వహణ

**జిల్లా పశువర్ధక శాఖ డిడి నాగమణి**



**కలువాయి డిసెంబర్ 30 (వార్తాప్రభ)** పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలువాయి మండలంలోని చీపినాపి గ్రామంలో ఎస్సి కాలనీ నందు పశు వైద్య శిబిరం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి కులాలకు తగు ప్రాధాన్యత ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో పశు వైద్య శిబిరం నిర్వహించామని నెల్లూరు పశు వైద్యశాఖ డిడి నాగమణి తెలిపారు.ఎస్సి కాలనీలో పశు వైద్య శిబిరాలు నిర్వహించి పశువుల్లో ఉండే వ్యాధులకు చికిత్సలు చేయడం జరిగిందన్నారు.మండలంలోని ఐదు మెడికల్ క్యాంపు లు నిర్వహిస్తున్నామని ఇది మూడో క్యాంపు అన్నారు. పశువులను పరీక్షించిన అనంతరం ఉచిత పశు గ్రాసం పంపిణీ చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏడి అన్నపూర్ణ డాక్టర్లు గంగాధరం కిష్ణ మోహన్ రాజేష్ సిబ్బంది గ్రామ పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మచిలీపట్నం పేర్ని జయసుధ కు బెయిల్ మంజూరు



**మచిలిపట్నం డిసెంబర్ 30 (వార్తాప్రభ ప్రతినిధి)** పేర్ని జయసుధ పై రేషన్ బియ్యం మాయం కేసులో మచిలీపట్నం రూరల్ పోలీసులు నమోదు చేసిన కేసు విషయంలో జిల్లా న్యాయస్థానం ను ఆశ్రయించిన వైసీపీ మాజీమంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) సతీమణి పేర్ని జయసుధ.డిసెంబర్ 18వ తేదీన జిల్లా కోర్ట్ లో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత 9వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కేసును రెండు సార్లు వాయిదా వేశారు. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది విజయ మొదట్లో వాదనలు వినిపించారు. ఆ తర్వాత విజయ స్థానంలో ప్రభుత్వం న్యాయవాది లంకే వెంకటేశ్వరరావు వాదనలు వినిపించారు వాదనలు ప్రతి వాదనలు అనంతరం తీర్పును 30 తేదీకి వాయిదా వేసిన విషయం అందరికీ విధితమే. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు 9వ అదనపు జిల్లా ,సెషన్స్ జడ్జి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయమూర్తి ప్రభుత్వ న్యాయవాది వాదనకు ఏకీభవించలేదు. అయితే విచారణలో పోలీసులకు సహకరించాలంటూ తీర్పు వెలువడించిన న్యాయమూర్తి.

## మండల పరిషత్ లో దివ్యాంగులకు క్యాంపు నిర్వహణ



**చేజర్ల డిసెంబరు 30 (వార్తాప్రభ)** మండల ప్రజా పరిషత్ కార్యాలయము చేజర్ల నందు సోమవారం కేంద్ర ప్రభుత్వ సంస్థ మరియు సంయుక్త ప్రాంతీయ కేంద్రము నెల్లూరు వారి ఆధ్వర్యంలో దివ్యాంగుల మరియు వయోవృద్ధుల క్యాంపు నిర్వహించబడింది.ఈ క్యాంపు నందు అర్హత గల వారికి మూడు చక్రాల బండ్లు వినికిడి యంత్రాలు వీల్ చైర్స్ మొదలగు ఉపకరణాలు కొరకు ఎంపిక చేయబడునని అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీయుత రాయపు రెడ్డి మరియు స్పెషల్ ఎడ్యుకేటర్ రఘు కేంద్ర ప్రభుత్వ సంస్థ మరియు సంయుక్త ప్రాంతీయ కేంద్రము నెల్లూరు వారు తెలియజేసి యున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు 53 మంది వికలాంగులు పాల్గొన్నారు

## చేజర్లలో న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు



**చేజర్ల డిసెంబరు 30 (వార్తాప్రభ)** మండలంలో నూతన సంవత్సర వేడుకలపై ఆంక్షలు ఉన్నట్లు ఎస్సై తిరుమలరావు తెలిపారు.న్యూ ఇయర్ వేడుకల పేరుతో మద్యం తాగి వాహనాలు నడిపిన బహిరంగ ప్రదేశాల్లో డీజేలు కేక్ కటింగ్ వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలు ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని సూచనలు ఇచ్చారు. మండలంలోని ప్రజలందరికీ ఈ సందర్భంగా ఆయన 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## చదువు అనేది భవిష్యత్తులో మీకు జ్ఞానాన్ని మాత్రమే కాదు, గౌరవాన్ని కూడా అందిస్తుంది

**-.నాగేశ్వర రెడ్డి యంఎన్ఆర్ ఫౌండేషన్**



**రెడ్డిగూడెం డిసెంబర్ 30 (వార్తాప్రభ ప్రతినిధి)**:రెడ్డిగూడెం మండలం కుదప హై స్కూల్ లో చదువు వెలుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో ముప్పిడి నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు అనేది భవిష్యత్తులో విద్యార్థులకు జ్ఞానాన్ని మాత్రమే కాదు, గౌరవాన్ని కూడా అందిస్తుందనీ, విద్యనే మన బలమైన ఆయుధం. అని మీరు మీ కలలను సాకారం చేసుకోవాలంటే చదువును సరిగ్గా ఉపయోగించుకోవాలని అని పదవ తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో నాగేశ్వరరెడ్డి అన్నారు.విద్యార్థులు పట్టుదలతో కష్టపడితే భవిష్యత్తు వారికి తలవంచుతుందని ఆయన ప్రేరణాత్మకంగా సూచించారు. పదవ తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం విద్యార్థుల విజయం కోసం వారి భవిష్యత్తు కోసం ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు పైడమర్ల కిరణ్ కుమార్ రెడ్డి మరియు యుటిఎఫ్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి

## -ఎస్ ఐ, అర్జున్...



**పెనుగంచిప్రోలు - డిశంబర్ 30( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండల ప్రజలకు , పోలీస్ అధికారులు హెచ్చిరిక చేశారు. ఈ నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ డిసెంబర్ 31వ తేది రాత్రి నిర్వహించుకొనే వేడుకలకు ప్రజల భద్రతను దృష్టిలో వుంచుకొని ఆంక్షలు తప్పని సరిచేయటమైనది. కావున ప్రజలు ఈ విషయాన్నీ గుర్తించి పోలీసులకు సహకరిస్తూ, పోలీసు కఠిన చర్యలు నుంచి దూరంగా వుండాలని విజయవాడ నగర పోలీస్ కమీషనర్ ఆదేశాల మేర పెనుగంచిప్రోలు ఎస్ ఐ. అర్జున్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.మండల ప్రజలకు సూచనలు, అర్ధరాత్రి రోడ్డుమీద వేడుకలకు అనుమతులు లేదనీ,రాత్రి 11 గంటల తరువాత వాహనములు నడుపు వ్యక్తి అతి వేగంగా అజాగ్రత్తగా వాహనము నడప రాదన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేసి వాహనము నడుప రాదనీ, మద్యం సేవించి వాహనములు నడుప రాదన్నారు. ప్రధాన రహదారులు అయిన పెనుగంచిప్రోలు జగ్గయ్యపేట రోడ్డు, మండల పరిధి లో హై వే రోడ్డు, గ్రామాల్లో సి సి రోడ్ల పై పూర్తిగా ట్రాఫిక్ ఆంక్షలు విధించబడునని,గుంపులు గుంపులుగా చేరి నడి రోడ్డు పై కేకులు కోసి అల్లర్లు చేయరాదన్నారు. డిసెంబర్ 31వ తేది రాత్రివేళ కేకలు వేస్తూ వాహనములపై తిరుగ రాదనీ,. హద్దుమీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు.డిసెంబర్ 31వ తేది రాత్రివేళ మండలం లో గస్తీ ముమ్మరంగా వుంటుందనీ, మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు.మద్యం సేవించి వాహనములు నడిపిన వారిపై చర్యలు తీసుకోన బడునని, ద్విచక్ర వాహనాలకు సైలంసర్ తీసివేసి అధిక శబ్దాలతో హోరెత్తించడం, అతి వేఘం తో రోడ్ల పై తిరగటం, వాహనములు నడుపుతూ విన్యాసాలు ప్రదర్శించడం, బాణాసంచా పేల్చడం వంటి వాటివలన ప్రశాంతతకు భంగం కలిగి వృద్ధులకు, చిన్న పిల్లలకు , రోగులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. కావున ఇలాంటి వాటికీ పాల్పడితే తగిన చర్యలు తీసుకోన బడునని,పై సూచనలను పాటించి నూతన సంవత్సర వేడుకలు ఆహ్లాదకర వాతావరణం లో జాగ్రత్తగా రోడ్డు ప్రమాదములకు లోను కాకుండా జరుపుకోవాలని ఎస్ ఐ, అర్జున్ విజ్ఞప్తి చేశారు.

## నూతన సంవత్సర వేడుకలకు పూర్తి బందోబస్తు

### ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్



**ఇబ్రహీంపట్నం డిసెంబర్ 30(వార్తా ప్రభ ప్రతినిధి):-** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో నూతన సంవత్సర వేడుకలకు పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశామని ప్రజలందరూ ఆహ్లాదకర వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని కోరారు ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్.జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు ఆదేశాలతో డిసెంబర్ 31వ తేది రాత్రి నిర్వహించుకొను వేడుకలకు ప్రజల భద్రతను దృష్ట్యా పోలీసులు సూచించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.ఎలాంటి ర్యాలీలకు అనుమతి లేదని, మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని, డిజె సౌండ్, బాణసంచా లాంటివి నియంత్రించాలని, పక్కవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేడుకలు నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు.నిబంధన అతిక్రమిస్తే తగిన చర్యలు తప్పని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశామని ప్రజలందరూ ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని తెలిపారు.ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

డిప్లమో రీజనల్ స్పోర్ట్స్ మీట్ కబడ్డీ ఛాంపియన్స్ గా ఆర్కే పాలిటెక్నిక్ విద్యార్థులు

## స్టేట్ లెవెల్ మీట్ కు అర్హత



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 30 (వార్తా ప్రభ ప్రతినిధి):-** డిప్లొమా రీజనల్ స్పోర్ట్స్ మీట్ కబడ్డీలో కేతనకొండ ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థులు రీజనల్ ఛాంపియన్స్ గా నిలిచారు. తిరువూరు డిపెండెంట్ శ్రీవాణి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పై ఫైనల్లో గెలుపొంది, జనవరి 28, 29, 30 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న స్టేట్ లెవెల్ మీట్ కు అర్హత సాధించారు. అలాగే కళాశాల డిప్లమో తృతీయ సంవత్సరం ఈసీఈ విద్యార్థి సిహెచ్ వెంకట గోపి షాట్ పుట్ లో ఫస్ట్ ప్లేస్ లో నిలిచాడు. ఇతను స్టేట్ లెవెల్ షార్ట్ ఫుడ్ కాంపిటేషన్ కు ఎంపికయ్యాడు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రీజనల్ ఛాంపియన్స్ గా నిలిచిన విద్యార్థులను, షాట్ పుట్ కు ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణయ్య, కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు మురళీనాథ్, శివశంకర్, మల్లికార్జున్ అభినందించారు. వారి భవిష్యత్ కు కావలసిన సూచనలు, సలహాలు అందించారు. ఆటలోనే కాకుండా చదువులోనూ నైపుణ్యంతో ప్రతిభ కనబర్చాలని సూచించారు. రాష్ట్ర క్రీడా పోటీల్లో గెలుపొంది దేశానికి ప్రతినిధులుగా ఎంపికవ్వాలని ఆకాంక్షించారు.

## రూ.3 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 30 (వార్తా ప్రభ ప్రతినిధి):-** కొండపల్లి పట్టణానికి చెందిన పెనుమాల వాణి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ద్వారా సీఎం చంద్రబాబు రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసింది. సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ ద్వారా ఆమెకు రూ.3 లక్షలు మంజూరయ్యాయి. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం బాధితురాలికి నాయకులు అందజేశారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే వసంతకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు చుట్టుకుదురు శ్రీనివాసరావు, నాయకులు మంగమ్మ, శ్రీను, అజయ్, ఉమా, చక్రవర్తి, కోటేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# సీఎస్ గా బీసీ బిడ్డ విజయానంద్ నియామకం పట్ల హర్షం.



**కలిదిండి డిసెంబర్ 30 (వార్తా ప్రభ)** రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా బీసీ సామాజికవర్గానికి చెందిన అధికారికి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి పదవిలో నియమించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బీసీల పట్ల తనకున్న నిబద్ధతను మరోసారి నిరూపించుకున్నారు.అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు.ఏలూరు జిల్లా కలిదిండి మండలం మట్టగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ, నూతన సీఎస్ గా బీసీ బిడ్డ విజయానంద్ ను నియమించినందుకు సీఎం చంద్రబాబునాయుడుకు,మంత్రి సవితమ్మకు గురుమూర్తి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీలకు అండగా నిలిచి, బడుగు బలహీన వర్గాల వారికి రాజ్యాధికారంలో ప్రాధాన్యత ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మరియు ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమే అన్నారు. బీసీల పట్ల సంపూర్ణ విశ్వాసంతో 8 మందికి మంత్రి పదవులను కేటాయించడంతో పాటు, బీసీ బిడ్డకు కీలకమైన ముఖ్య కార్యదర్శి పదవీ బాధ్యతలు అప్పగించి, రాష్ట్రంలో బీసీ జాతులందరిలో ఒక నమ్మకాన్ని, నూతన ఉత్తేజాన్ని, ఆశలను చిగురింపజేసిన సీఎం చంద్రబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటామని, ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో బీసీ నేతలకు, అధికారులకు ఎప్పుడూ సమున్నత గౌరవం లభిస్తోందని, బీసీ సీనియర్ నేత చింతకాలయ అయ్యన్న పాత్రుడికి శాసన సభ స్పీకర్ గా, కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కేంద్రమంత్రిగా అవకాశమిచ్చారన్నారు.ప్రస్తుత తెలుగుదేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు బీసీ నేత పల్లా శ్రీనివాస్, రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు, టీటీడీ ఈవో శ్యామలరావు కూడా బీసీలు కావడం తమకెంతో గర్వకారణమన్నారు.అయిదేళ్ల జగన్ పాలనలో ఏనాడూ బీసీలను ఖాతరు చేయలేదని, బలహీన వర్గాల పట్ల నిర్దయగా వ్యవహరించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు కోపనాతి వెంకటేశ్వరరావు తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు అండ్ రాజు కాశీపతి బొమ్మిడి వడ్డికాసులు మోకా రామారావు తిరుమల శెట్టి రామారావు తిరుమాని వీర్రాజు అంద్రాజు నరసింహమూర్తి బొమ్మిడి రాముడు పొన్నాల తాతారావు తదితరులు పాల్గొన్నారు

# గత వైసిపి పాలనలో సాగునీటి సంఘాల వ్యవస్థ నిర్వీర్యం

- సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకటగోపాలకృష్ణారావు
- విజయవాడలో జలవనరుల శాఖ కాడా స్పెషల్ కమిషనర్ ను కలిసిన 'ఆళ్ళ' మరియు సాగునీటి సంఘాల సారధులు



**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గత వై.సి.పి ప్రభుత్వం 2019-2024లో సాగునీటి సంఘాల వ్యవస్థ నిర్వీర్యం అయిందని, వీటిని ప్రస్తుతం పునరుద్ధరించి రాష్ట్రవ్యాప్తంగా రైతులకు సేవ చేసే అవకాశం ఇచ్చినందుకు కూటమి ప్రభుత్వానికి సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు, నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు ధన్యవాదాలు తెలిపారు. ఈరోజు ఉదయం విజయవాడ హనుమాన్ పేట లోని జలవనరుల శాఖ కాడా కార్యాలయంలో సాగునీటి సంఘాల వ్యవస్థను పర్యవేక్షించే ఐ.ఏ.ఎస్ అధికారి, కాడా స్పెషల్ కమీషనర్ ఎస్.రామసుందర రెడ్డిని సాగునీటి సంఘాల సమాఖ్య కార్యవర్గ సభ్యులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ లు పామర్తి శ్రీనివాసరావు, దేవినేని సత్యనారాయణలతో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించి పూలమొక్క అందజేసి సాగునీటి సంఘాల అధ్యక్షులుగా పనిచేయటానికి అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇదే విషయమై విజయవాడ నుండి ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ 2019-2024 మధ్య వై.సి.పి హయాంలో సాగునీటి సంఘాల వ్యవస్థ నిర్వీర్యం అయిందన్నారు. అంతకు ముందు చంద్రబాబు హయాంలో 2014-2019లో నీరు-ప్రగతి ద్వారా సాగునీటి సంఘాల ప్రతినిధులతో 28వేల పనులు చేయించి 7 లక్షల ఎకరాల ఆయకట్టును అదనంగా స్థిరీకరించినందువల్ల అప్పటి తెలుగుదేశం ప్రభుత్వానికి కేంద్రం నుంచి 9 ప్రతిభ అవార్డులు అందినట్లు గుర్తు చేశారు. ఈ ఏడాది అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ఎన్.డి.ఏ ప్రభుత్వం ఉమ్మడి 13 జిల్లాల్లో 49వేల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులకు, 6149 మంది సాగునీటి సంఘాల అధ్యక్షులకు, 245 మంది డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లకు, 58 మంది ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్లకు ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించి రైతులకు సేవచేసే అవకాశం ఇచ్చినందుకు ఎన్.డి.ఏ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రివర్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడుకు, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాదు, కాడా స్పెషల్ కమీషనర్ ఎస్.రామసుందర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సాగునీటి సంఘాల వ్యవస్థలో మూడు దశల్లోను రైతు ప్రతినిధులుగా ఉన్న ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ లకు, జిల్లా పరిషత్, డి.ఆర్.సి సమావేశాల్లోను, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ లను, మండల పరిషత్ జనరల్ బాడీ సమావేశాల్లోను నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను, గ్రామ పంచాయితీ పాలకవర్గ సమావేశాల్లో ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరు కావటానికి చర్యలు తీసుకోవాలని కాడా స్పెషల్ కమీషనర్ దృష్టికి తీసుకువచ్చినట్లు 'ఆళ్ళ' తెలిపారు. స్పెషల్ కమీషనర్ ను కలిసిన వారిలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ లు కొమ్మారెడ్డి రాజేష్, కొసరాజు రాంబాబు తదితరులు ఉన్నారు.

# పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో "66" ఫిర్యాదులు.





**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి 13.00 గంటల వరకు ఎన్. టి. ఆర్. జిల్లా పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో నిర్వహించడం జరుగుతున్న విషయం తెల్సిందే. ఈ నేపధ్యంలో సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఎన్.టీ.ఆర్.జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, ఆదేశాలు మేరకు డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయరాణి, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"( పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించి బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 66 ఫిర్యాదులపై భాదితులతో మాట్లాడడం జరిగింది.దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.సోమవారం అందిన ఫిర్యాదుల్లో నగదు లావాదేవీలకు సంబంధించినవి 18, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి 5, మహిళా సంబంధిత నేరలకు సంబంధించి 5 , భూవివాదాలకు సంబంధించినవి 15, మరియు వివిధ మోసాలకు సంబంధించినవి 7, దొంగతనాలకు సంబంధించినవి 2, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు, సంఘటనలకు సంబంధించినవి 14, మొత్తం 66 ఫిర్యాదులును స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయరాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదులు పరిష్కరించుటలో సహకారాన్ని అందించారు.

# మత్స్యకార సంక్షేమమే ఎన్డీఏ కూటమి ధ్యేయం.

### రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు.



**కలిదిండి డిసెంబర్ 30 (వార్తా ప్రభ)** మత్స్యకార సంక్షేమమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజుశ్రీనివాసరావు అన్నారు. ఏలూరు జిల్లా,కలిదిండి మండలం,పెదలంక పంచాయతీ పెదపట్లపూడి మత్స్య సహకార సంఘ నూతన పాలకవర్గం ఎన్నిక సందర్భంగా ఏకగ్రీవంగా,ఎన్నికైన మత్స్య సహకార సొసైటీ అధ్యక్షులు నడకుదిటి ఏడుకొండలు ఉపాధ్యక్షులు నడకుదిటి వేణు కార్యదర్శి నడకుదిటి శివ మిగిలిన పాలకవర్గ సభ్యులను అభినందించి పాలకవర్గ సభ్యులంతా ఐక్యతతో పనిచేసి మత్స్య సహకార సంఘం అభివృద్ధికి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు బడ్జెట్లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించి మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు.గతంలో ఆదరణ పథకం ద్వారా మత్స్యకారులకి వేట పరికరములు,వలలు పడవలు 50 సంవత్సరాల నుండి మత్స్యకారులకు పెన్షన్ సదుపాయం కల్పించిన ఘనత నారా చంద్రబాబు నాయుడుదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఒడుగు గోపాలం,నడకుదుటి గణపతి,కొక్కిలిగడ్డ అంజిబాబు, కొయ్యల గడ్డ నాగరాజు, నడకుదుటి ఆనందారావు, నడకుదుటి శారద రావు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### మాస్టర్స్ అథ్లెటిక్స్ విజేత జ్యోతి రెడ్డి ను అభినందించిన శాసనసభ్యులు

## శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



**జగ్గయ్యపేట డిసెంబర్ 30 (వార్తప్రభ)**ఇటీవల గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం నందు 44 వ ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలలో వత్సవాయి మండలం గ్రామానికి చెందిన కురుగుంట్ల జ్యోతి రెడ్డి రన్నింగ్ 100 మీటర్స్, 200 మీటర్స్ మరియు 5 కిలోమీటర్లు వాకింగ్ లో ప్రథమ స్థానం గోల్డ్ మెడల్ ను కైవసం చేసుకుని, ఫిబ్రవరి నెలలో రాజస్థాన్లో జరగనున్న నేషనల్ మీట్ కు సెలెక్ట్ అవడం జరిగింది. ఈ సందర్భంగా వారు జగ్గయ్యపేట పట్టణంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జ్యోతి రెడ్డి ను శాసనసభ్యులు తాతయ్య అభినందించి, సర్టిఫికెట్ ,మెడల్స్ ను అందజేశారు.

## నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి చొరవతో రోడ్డు డివైడర్ పొడవు కుదింపు

### యు టర్న్ ఇబ్బందులు తొలిగాయని స్థానికులు హర్షం







**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ట్రాఫిక్ జామ్ సమస్య పరిష్కారానికి రాజకీయ నాయకులు నడుం బిగించారు. ట్రాఫిక్ సమస్యల కు ముఖ్య కారణమైన ""యు టర్న్"" పాయింట్ పై రాజకీయ నాయకులు దృష్టి సారిస్తున్నారు. దాంతో ట్రాఫిక్ జామ్ నియంత్రణలో వారూ భాగస్వామ్యం భాద్యతలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిట్టినగర్ సెంటర్ లో మిల్క్ ఫ్యాక్టరీ వైపు వెళ్ళే మార్గంలో రామచంద్రరావు మటన్ షాపు సమీపంలో ""యు టర్న్""" పాయింట్ ని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి చొరవతో కుదించారు. స్వయంగా ఆమే దగ్గరుండి డివైడర్ మీ సుమారు మూడు మీటర్లు మేరకు తొలిగింపు చర్యలు చేపట్టారు. గంట వ్యవధిలో దాని పూర్తిగా తొలిగించారు. దాంతో వాహనాలు మలుపు సులువైంది. గతంలో నెహ్రూ బొమ్మ సెంటర్లో ఇలాగే డివైడర్ ని తొలిగింపు చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టిన విషయం తెల్సిందే.

## ది సిటీ ఎన్జీఓ అసోసియేషన్ డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**మంగళగిరి: డిసెంబర్ 30 (వార్తాప్రభ ప్రతినిధి)**ది సిటీ ఎన్జీఓ అసోసియేషన్ డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం మంగళగిరి లోని అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు భవనారి వెంకటేష్ బాబు ఉత్తర్వుల మేరకు ది సిటీ ఎన్జీవో అసోసియేషన్ గుంటూరు డివిజన్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఎన్జీఓ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షునిగా ఎం నాగరాజు, సహాధ్యక్షునిగా డి ప్రకాశరావు, ఉపాధ్యక్షులు గా బి రాధిక, ఎస్ సాజిద్ అలీ, కార్యదర్శిగా కె సుబ్రహ్మణ్యం, కార్యాలయ కార్యదర్శి గా డి రామకృష్ణయ్య, సహాయ కార్యదర్శులు గా టి బాపూజీ, బి ఏడుకొండలు, కోశాధికారిగా పి శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక ప్రక్రియకు ఎన్నికల అధికారిగా కె ఆర్ఎస్ గణేష్, సహాయ ఎన్నికల అధికారిగా అడపా రవి, పరిశీలకులుగా ఆర్ వినోద్ కుమార్ లు వ్యవహరించారు. అనంతరం ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి కెఆర్ఎస్ గణేష్ ప్రమాణస్వీకారం చేయించారు.

# మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయటం రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

- విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)
- స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశం పాల్గొన్న ఎమ్ పి చిన్ని





**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలోని రూరల్, అర్బన్ స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయటమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం.. ఎస్.హెచ్.జి సభ్యులకు మరింతగా తయారు చేసిన వస్తువులకి సంబంధించి మార్కెటింగ్, ప్యాకింగ్, బ్రాండింగ్ పై అవగాహన పెంచేందుకు ఢిల్లీ కి చెందిన ఎన్.జి.వో సంస్థ వ్యోమిని డైరెక్టర్ ప్రాచీ కౌషిక్ సహకారం తీసుకుంటున్నట్లు ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో తన పార్లమెంట్ నియోకవర్గంలోని రూరల్ , అర్బన్ ఎస్.జి.హెచ్ మహిళలు, వి.వో.ఏ లతో సమావేశం నిర్వహించారు. ఎస్.జి.హెచ్ మహిళలు తయారు చేస్తున్న ప్రొడక్ట్స్ వివరాలు ఎంపి కేశినేని శివనాథ్ అడిగి తెలుసుకున్నారు. ఒక ప్రొడక్ట్ ను తయారు చేయటంతో పాటు ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ విషయాలపై ఎన్.జి.వో సంస్థ వ్యోమిని డైరెక్టర్ ప్రాచీ కౌషిక్ అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో అర్బన్ కి చెందిన ఎస్.హెచ్.జి మహిళల్లో ఎక్కువమంది మహిళలు క్లాత్ బిజినెస్ చేస్తున్నారన్న విషయం గ్రహించిన ఎంపి కేశినేని శివనాథ్ వారంతా ఒక క్లస్టర్ గా ఏర్పాడలన్నారు.అలాగే హెూమ్ ఫుడ్స్, పేపర్ బ్యాగ్స్, బోటిక్స్, ఎంబ్రాయిడరీ క్లస్టర్ల కు ఏర్పాటు చేసేందుకు గ్రూపులు గా ఏర్పాడలని సూచించారు. వీరందరిని క్లస్టర్స్ ఏర్పాటు అయ్యే విధంగా చూడాలని డి.ఆర్.డి.ఎ పి.డి శ్రీనివాస్ ను ఆదేశించారు. అలాగే పేపర్స్ బ్యాగ్స్ పై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. అధిక సంఖ్య ఒక ప్రొడక్ట్ ను ఉత్పత్తి చేస్తే ఆ ప్రొడక్ట్ మార్కెటింగ్ తాను చూసుకుంటానని భరోసా ఇచ్చారు. అవసరమైన వారికి హైదరాబాద్ లోని ఎన్.ఐ.ఆర్.డిలో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. రూరల్ కి ఎస్.హెచ్.జి మహిళలు హెూమ్ ఫుడ్స్ , పేపర్ ప్లేట్స్ తయారు చేసేందుకు క్లస్టర్ గా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. క్లస్టర్ గా ఏర్పడితే ప్రభుత్వం సబ్సిడి లభిస్తుందని తెలిపార. ఈ సమావేశంలో ఎస్.హెచ్.జి మహిళలు తయారు చేసిన వస్తువులను ఎంపి కేశినేని శివనాథ్ ఆసక్తి గా తిలకించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పి.వో.యు.సి.డి వెంకటరమణ, ఎన్టీఆర్ జిల్లా అర్బన్ మహిళ సమైఖ్య ప్రెసిడెంట్ మీనాక్షి ఖడ్గరాజు, .పి.డి.ఐ.సి.డి.ఎస్ ఉమాదేవి, మార్పు ట్రస్ట్ డైరెక్టర్ సూయజ్ కార్పొరేటర్ ఉషారాణి, మాజీ మేయర్ శకుంతల, రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం, టిడిపి నాయకులు డాక్టర్ సంకె విశ్వనాథం లతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మహిళలకు అన్ని రంగాల్లోనూ సమాన అవకాశాలు కల్పించాలి

**గాంధీ దేశం ట్రస్ట్ వ్యవస్థాపకులు గాంధీ నాగరాజన్ డిమాండ్**

**దేశవ్యాప్తంగా గ్రామాల్లో మహానాడులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తేవాలని రాహుల్ గాంధీకి లేఖ**





**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 30 (వార్తా ప్రభ ప్రతినిధి)** మహిళలకు దేశంలో సామాజిక, రాజకీయ , ఆర్థిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్ డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీని గాడ్సే హత్య చేసిన జనవరి 30వ తేదీని పురస్కరించుకొని ప్రతి నెల 30వ తేదీన గాంధీ నాగరాజన్ వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం తెనాలిలో దండియాత్ర -2 లో భాగంగా ఆయన నగరంలో ఆటో ద్వారా ప్రచార యాత్ర చేశారు. ఈ సందర్భంగా గాంధీ నాగరాజన్ మాట్లాడుతూ బిజెపి పాలనలో దేశవ్యాప్తంగా మతాల మధ్య, ప్రజల మధ్య ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడిందని విమర్శించారు. అలాగే తాను కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీకి భారతదేశం లోని పరిస్థితులను వివరిస్తూ ఒక లేఖ రాయడం జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా గ్రామాల్లో తక్కువ ఖర్చుతో మహానాడులు నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, తద్వారా ప్రజాస్వామ్య రక్షణకు కృషి చేయాలని రాహుల్ గాంధీని ఆ లేఖలో కోరడం జరిగిందన్నారు. రాహుల్ గాంధీకి రాసిన లేఖలో సామాజిక, రాజకీయ ఆర్థికపరమైన దురాగతాలను ఎదుర్కోవాలని ఆయనను కోరడం జరిగిందన్నారు. మనుధర్మం పాలించే దేశంలో మానవత్వం మంట కలిసి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ చూపిన బాటలో రాహుల్ గాంధీ దేశమంతా పర్యటించి ప్రజలను చైతన్యవంతం చేయాలని, బిజెపి ని కమ్యూనిస్టులు సాయంతో దీటుగా ఎదుర్కోవాలని తాను కోరడం జరిగిందన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీలోనూ మహిళలకు సమాన అవకాశాలు కల్పించేలాగా కాంగ్రెస్ పార్టీ తగిన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరినట్లు గాంధీ నాగరాజన్ వివరించారు. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి నివాళులర్పించిన అనంతరం నాగరాజన్ తన ప్రచార యాత్ర ప్రారంభించారు. ఈ ప్రచార కార్యక్రమంలో గాంధీ ట్రస్ట్ బాధ్యురాలు బంగారు భారతి తదితరులు పాల్గొన్నారు.



# తనపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు సరైంది కాదు

- కొత్తపేట పోలీసు స్టేషన్లో పిర్యాదు చేసిన చలసాని
- ప్రాథమిక దర్యాప్తు చేపట్టిన కొత్తపేట పోలీసులు
- కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు

**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ పై సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలు సోమవారం ఓ ప్రకటన లో ఖండించారు. గత కొద్ది రోజులుగా సోషల్ మీడియా గ్రూపు లలో అసత్య ప్రచారాలు చేస్తున్నారు. నేను 1987వ సంవత్సరం నుండి తెలుగుదేశం పార్టీ సభ్యుడునై ఉన్నాను, సదరు పార్టీలో క్రియాశీలకంగా ఉండి పార్టీలో అనేక పదవులు చేసి, నేను తెలుగుదేశం పార్టీలో శాశ్వత సభ్యత్వం కలిగియున్న నా పై తప్పుడు ప్రచారం చేయుచూ అందులో భాగంగా నాకు ఎటువంటి సంబంధం లేదని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీలో నేను సభ్యుడినని చెబుతూ నా ఫోటో మరియు నా వ్యక్తిగత వివరములతో ఒక ఫేక్ ఐడి కార్డు ని సృష్టించి, నాకు వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం ఉన్నట్లుగా చూపిస్తూ, నా వ్యక్తిగత మరియు సామాజిక ప్రతిష్టకు భంగం కలిగేలా సదరు ఫేక్ ఐడీ కార్డును వివిధ గ్రూపులకు చేరవేస్తూ కొంతమంది వ్యక్తులు దురుద్దేశ పూర్వకంగా, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.దీని పై సోమవారం కొత్తపేట పోలీస్ స్టేషన్ నందు పిర్యాదు చేయడమైనది, ఇలాంటి అసత్య ప్రచారులు చేయుచున్న వారి పై తగు చర్యలు తీసుకోనబడుతాయి అని ఈ సందర్భముగా తెలిపారు.

# తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై చంద్రబాబు కీలక నిర్ణయం

**టీటీడి ఛైర్మన్ బీఆర్ నాయుడు**

**అమరావతి: డిసెంబర్ 30 (వార్తాప్రభ ప్రతినిధి)** తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించడంపై ఏపీ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సిఫార్సు లేఖలను అనుమతించేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడి) ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. సోమవారం సీఎంతో బీఆర్ నాయుడు సమావేశమయ్యారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై చంద్రబాబుతో చర్చించారు. వారానికి నాలుగు సిఫార్సు లేఖలు అనుమతించేందుకు చంద్రబాబు అంగీకరించినట్లు బీఆర్ నాయుడు తెలిపారు. వారానికి రెండు బ్రేక్ దర్శనాలు, రెండు రూ.300 దర్శనానికి సంబంధించిన లేఖలు అనుమతించేందుకు సీఎం అనుమతి ఇచ్చారని బీఆర్ నాయుడు వెల్లడించారు.

# నేడే నూతన సంవత్సర స్వాగతిస్తూ వేడుకలతో భారీ ఈవెంట్

**సందడి చేయనున్న జబర్దస్త్ టీం మరియు డీ డాన్సర్లు**





**జగ్గయ్యపేట డిసెంబర్ 30 (వార్తా ప్రభ)** పట్టణంలోని బి కన్వెన్షన్ హాల్లో ఎప్పుడు లేని విధంగా భారీ సెట్టింగ్లతో న్యూ ఇయర్ వేడుకలకు ఈవెంట్ సిద్ధం చేశామని హ్యాపీ ఈవెంట్ ఎంటర్టైన్మెంట్ చైర్మన్ యశ్వంత్ వీరు తెలిపారు. ఈ సందర్భంగా ఈవెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతూ డిసెంబర్ 31 సాయంత్రం 6 గంటల నుండి రాత్రి ఒంటిగంట వరకు భారీ ఈవెంట్ ప్లాన్ చేశామని. ఈ ఈవెంట్ కు జబర్దస్త్ నుండి నూకరాజు మరియు ఏంజెల్ ఆసియా వస్తున్నట్లు. ఈవెంట్ కు యాంకర్ గా శాంతి. డి డాన్సర్స్ గ్రూప్, సింగర్ మద్దూరి హేమంత్, డీజే అమీనా, ఇంకా అనేకమంది బుల్లితెర నటీనటులు వస్తున్నట్లు. కార్యక్రమంలో భాగంగా లైవ్ బ్యాండ్, కాంతారా స్పెషల్ యాక్ట్, క్రాకర్స్ పరేడ్, ఫుడ్ ఫెస్టివల్ తో పాటు అనేక రకమైన ఉత్సాహవంతమైన కార్యక్రమాలు వీక్షకులను అలరించడానికి భారీ సెట్టింగ్లతో వేదిక సిద్ధం చేశామని. కావున జగ్గయ్యపేట నియోజకవర్గం లోని ఈవెంట్ కు రావాలనుకునే ప్రేక్షకులు త్వరగా టికెట్లు బుక్ చేసుకోవాలని ఈవెంట్ ఆర్గనైజర్ తెలియజేశారు. టిక్కెట్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా ఎంఐపీ టికెట్లు 1250, రెగ్యులర్ టికెట్లు 299రూపాయలు, జంటకు 499 రూపాయలు అందుబాటులో ఉంచామని. త్వరపడి టికెట్లు బుక్ చేసుకోవాలని. టికెట్లు కావాలనుకునేవారు 7337375901 నెంబర్ పై సంప్రదించాలని వారు కోరారు. ఈవెంట్ జరిగే ప్రదేశంలో కూడా టికెట్లు దొరుకుతాయని హ్యాపీ ఈవెంట్ చైర్మన్ యశ్వంత్ వీరు తెలియజేశారు.

# సిబ్బంది సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళతా

**రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**నల్గొండ : డిసెంబర్ 30 (వార్తాప్రభ ప్రతినిధి)** దీర్ఘకాలంగా సమగ్ర శిక్ష లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండ జిల్లా పర్యటన సందర్భంగా, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన సందర్భంలో జిల్లాలో పనిచేస్తున్న పలువురు సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు మంత్రిని కలిశారు. రాష్ట్ర విద్యా శాఖలోని సమగ్ర శిక్షలో తాము దీర్ఘకాలంగా ఒప్పంద ఉద్యోగులుగా పనిచేస్తున్నామని, తమకు వేతనాలు పెంచడంతోపాటు, తమను రెగ్యులరైజ్ చేయాలని, అలాగే బీమా, ఇతర బెనిఫిట్స్ ను కల్పించాలని కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. ఇందుకు స్పందించిన మంత్రి వారితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అంశాలపై ఆలోచించి రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు . జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి , తదితరులు ఉన్నారు.

# రైల్వే విద్యుత్తు లైన్ల దగ్గర గాలిపటాలు ఎగురవేయకండి

**విద్యుత్తు తీగల నుండి వేలాడుతున్న గాలిపటం దారాలను తాకడాన్ని నివారించండి**

**సంక్రాంతి పండుగ సీజన్ సంధర్భంగా ప్రజలకు దక్షిణమధ్య రైల్వే సూచన**

**విజయవాడ, డిసెంబర్ 30 (వార్తాప్రభ ప్రతినిధి)** రైల్వే ప్రాంగణంలో యార్డులు, ట్రాక్‌లు సమీపంలోని జనావాసాల ప్రాంతాలతో సహా విద్యుత్తు తీగల దగ్గర ఆడుకుంటుండగా పలువురు గాలిపటాలు ఎగరవేయేవారు విద్యుదాఘాతానికి గురై మరణించినట్లు గమనించబడింది. ఇలాంటి సంఘటనలు భారతీయ రైల్వేలోని అనేక జోన్‌లలో మునుపటి సంక్రాంతి పండుగ సీజన్‌లో, కొన్ని కేసులు నమోదయ్యాయి. ఇందులో వ్యక్తులు 25 కె. వి ట్రాక్షన్ ఓవర్‌హెడ్ కండక్టర్‌లలో చిక్కుకున్న గాలిపటం దారాలను తాకడంతో విద్యుత్ షాక్‌లు లేదా విద్యుదాఘాతానికి గురయ్యారు. సాధారణంగా ప్రజలచే ఉపయోగించబడే చైనా నుండి దిగుమతి చేయబడిన గాలిపటాల దారాలు, విద్యుత్ వాహకం అవడంవలన అవి మానవ జీవితానికి మరియు క్లిష్టమైన రైల్వే ఎలక్ట్రికల్ మౌలిక సదుపాయాలకు కూడా గణనీయమైన నష్టాలను కలిగిస్తాయి.ఈ విషయంలో, దక్షిణ మధ్య రైల్వే ప్రజలనుండి సంపూర్ణ సహకారాన్ని కోరుతుంది మరియు రైల్వే ట్రాక్‌ల దగ్గర గాలిపటాలు ఎగురవేయడాన్ని నివారించమని, ఎందుకంటే ఓవర్‌హెడ్ లైన్‌లు అధిక వోల్టేజ్ విద్యుత్‌తో ఛార్జ్ చేయబడినందువలన, వాటి తాకినప్పుడు మానవ జీవితానికి పెను ప్రమాదం కలిగిస్తాయని తెలియజేస్తుంది.ఓవర్‌హెడ్ కండక్టర్ల నుండి గాలిపటం దారాలను వేలాడుతున్న సమయంలో రైల్వే అధికారులకు తెలియజేయాలని సూచించబడింది తద్వారా శిక్షణ పొందిన సిబ్బంది సురక్షితంగా గాలిపటాల దారాలను తీసివేయగలరని సలహానిచ్చింది .



## గోపికా గీతం

(తిరుప్పావై)

**ధనుర్మాస స్నాన, వ్రత సంకీర్తనం**

**పదిహేనవ పాశురం:**

“ఎల్లే యిలంగిళియే ! యిన్నమురంగుడియో?
శిల్లెన్రళై యేన్మిన్? నజ్ఞమీర్, పోదరుగిన్రేన్
వల్లై ఉన్ కట్టురైగళ్ పణ్డేయున్ వాయఱిదుమ్
వల్లీర్గళ్ నీజ్ఞళే, నానేదా నాయుడుగ
ఒల్లైనీ పోదాయ్, ఉనక్కెన్న వేఱుడైయై ?
ఎల్లారుమ్ ఫోన్దారో? ఫోన్దార్, ఫోన్దెణ్ణిక్కోళ్
వల్లానై కొన్రానై మాత్తారై మాత్తళిక్క
వల్లానై మాయనై ప్పాడేలో రెమ్బావాయ్.”

**వివరణ:** గొల్ల భామలు:ఓ యదు శుకవాణీ! నీవు ఇంకా నిద్రపోతున్నావా? ఇదేమి ఆలస్యం?
మేము నిన్ను లేపేందుకు ఇక్కడ ఉన్నాము.ఇక నిద్రలెమ్ము, మాకు నీకు ఒకటే పని, ఆ గోపాలుడి సేవ చేయడం.
గొల్ల గోపిక: ఓ యాదవీమణులారా!నాకు ఆ గోపాలుడి గుణాలను ఆస్వాదించేందుకు సమయం ఇవ్వండి.ఇప్పుడు మీకూ, నాకూ చికాకులు ఎందుకు? సరే, పదండి, నేను వస్తాను.
గొల్ల భామలు: నీ మాటల నైపుణ్యం మాకు తెలుసు.నీకు నీవే సాటి! మాకు అలవాటైన మాటలు మాట్లాడడం కాదు, వెంటనే మాతో రా!
గొల్ల గోపిక:మన్నించండి, సరే!ఇప్పుడు నా కర్తవ్యం ఏమిటి?
గొల్ల భామలు: మేము ఆ వటపత్రసాయి అయిన యదునందనుని సేవించడానికి వచ్చాము.
ఆయనను కీర్తిస్తూ గానం చేయడానికి, నిన్ను మా గోష్టిలో చేర్చుకోవడానికి వచ్చాము.
వేగంగా రా, ఆ మహానుభావుడి కీర్తిని కలిసి పాడుదాం.

**సందేశం:** ఈ పాశురం సామూహిక భక్తి భావనకు ఒక స్ఫూర్తి.
1. భగవంతుని గుణగానం చేయడం ద్వారా, భక్తులందరికీ పరమానందం లభిస్తుంది. 2. అనవసరమైన ఆలస్యం, మాటలు వీడి, దైవిక సేవలో పాల్గొనడం మన ధర్మం. 3. సమష్టిగా కీర్తించడం ఆధ్యాత్మిక స్ఫూర్తిని పెంచుతుంది.ఓ గొల్ల గోపికలారా!రండి, మనం కలసి ఆ శ్రీకృష్ణుని స్తుతి చేస్తూ, పరమానందాన్ని పొందుదాం. ఆయన మహిమలను పాటించేందుకు ఒక్కటిగా సాగుదాం!

**ఆండాళ్ తిరువడిగలే శరణం**

రచయిత - వై.ఎస్. యాదవ్, ఛైర్మన్, జై యాదవ్ జై మాధవ్ ట్రస్ట్.

# జనసేనలో చేరిన ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ

**ఆప్కో మాజీ ఛైర్మన్, వైసీపీ నాయకుడు గంజి చిరంజీవి కూడా చేరిక**





**విజయవాడ : డిసెంబర్ 30 (వార్తాప్రభ ప్రతినిధి)** జనసేన పార్టీలో వైసీపీ నేతలు ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ , ఆప్కో మాజీ ఛైర్మన్ గంజి చిరంజీవి చేరారు. సోమవారం సాయంత్రం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీ కండువా వేసి కైకలూరు నియోజకవర్గానికి చెందిన వెంకట రమణని, మంగళగిరి నియోజకవర్గానికి చెందిన గంజి చిరంజీవి, రాధ ని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, ఎం.ఎస్.ఐ.డి.సి. ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస రావు , పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను పాల్గొన్నారు.

# సంబర జాతరకు విస్తృత ఏర్పాట్లు



**శంబర, డిసెంబర్ 30 (వార్తాప్రభ ప్రతినిధి)** వచ్చే జనవరి నెలలో 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే శంబర పొలమాంబ జాతరకు పార్వతీపురం మన్యం జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ప్రధాన వేడుకల అనంతరం, పండుగ తొమ్మిది వారాల పాటు కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీనిని రాష్ట్ర కార్యక్రమంగా ప్రకటించింది. జిల్లా నలు మూలల నుండి అలాగే పొరుగు జిల్లాలు, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల నుండి సుమారు మూడు లక్షల మంది భక్తులు వస్తారని జిల్లా యంత్రాంగం అంచనా వేస్తోంది. శంబర పోలమాంబ జాతర అనేది ఉత్తరాంధ్ర జిల్లాలలో ప్రసిద్ధి చెందిన పండుగ. చాలా మంది యాత్రికులు ఆరాధ్య దేవత దర్శనం కోసం వస్తారు. ఉత్తర ఆంధ్రాలో జరిగే అతి పెద్ద పండుగలలో ఇది ఒకటి.సోమవారం మక్కువ మండలం శంబర వద్ద శంబర పొలమాంబ జాతర ఏర్పాట్లపై మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతరను విజయవంతం చేసేందుకు ప్రతి అడుగు పకడ్బందీగా వేయాలని అధికారులను ఆదేశించారు. “సిరిమాను ఉత్సవం”లో ముఖ్యంగా విద్యుత్ సరఫరా సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరించారు. పారిశుధ్యం అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని ఆమె అన్నారు. తాగునీరు ఏర్పాటు చేయాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆమె కోరారు. ప్రజలు పోలమాంబ దర్శనం చేసుకునేందుకు ప్రజా రవాణా శాఖ తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లకు ప్రజలు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. క్యూలైన్లు, దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు సక్రమంగా ఏర్పాటు చేయాలని, ఆలయానికి ఆనుకుని ఉన్న గోముఖి నది వద్ద స్నానాలు, వంటలు చేపట్టడంపై దృష్టి సారించాలని ఆమె తెలిపారు. పోలీసులు సరైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆమె అన్నారు. 2.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు నిర్వహణ పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ ప్రసంగిస్తూ ప్లాస్టిక్ వాడకుండా చూడాలని ఆదేశించారు. జాతర చూసేందుకు ప్రజలు ఎక్కే ఏనుగు కొండ వద్ద ప్రాణాలను రక్షించే ఏర్పాట్లు చేయాలని, మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి పాయింట్ వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసు సూపరింటెండెంట్ ఎస్వీ మాధవ రెడ్డి మాట్లాడుతూ సరైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, బారికేడింగ్‌తో పాటు సరైన వెలుతురును ఏర్పాటు చేయాలన్నారు.క్యూ లైన్లలో అత్యవసర నిష్క్రమణ పాయింట్లను కూడా ఉండాలని సూచించాడు. దాదాపు ఐదు వందల మంది పోలీసు సిబ్బందిని మోహరిస్తామని చెప్పారు.ఆర్ టి సి 61 బస్సులను ఏర్పాటు చేస్తోంది. రోడ్ల మధ్యలో ఉన్న స్తంభాలను టాస్క్ కొ మార్చ నుంది. వైద్య, ఆరోగ్య శాఖ 8 వైద్య శిబిరాలకు ఏర్పాట్లు చేస్తోంది. 4 వందల మంది పారిశుధ్య కార్మికుల ఏర్పాటుతో పాటు అవసరమైన మెటీరియల్‌ను పంచాయతీ రాజ్ శాఖ ఏర్పాటు చేస్తుంది.ఈ సందర్భంగా మంత్రి శంబర జాతర పోస్టర్ను విడుదల చేశారు.పార్వతీపురం సబ్ కలెక్టర్ మరియు ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్అశుతోష్ శ్రీవాస్తవ, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ అంకితా సురానా, టెంపుల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె రామచంద్రరావు, జిల్లా గ్రామ పంచాయితీ అధికారి తమర్భ కొండల రావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ఓ ప్రభాకర్ రావు, తదితరులు హాజరయ్యారు.



# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 70 అర్జీలు

● ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిపెట్టి పరిష్కరించాలి ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం స్థానిక కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించారు. అర్జీలను స్వీకరించిన అనంతరం కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో నమోదయ్యే అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా అందిన అర్జీలకు నిర్దేశ గడువులోగా తగిన పరిష్కారాలు చూపాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూకు 25, ఎంఏయూడీకి 13, పోలీస్ 6, విద్య 5, పంచాయతీరాజ్ 4, డీఆర్డీఏకు 3 అర్జీలురాగా ఏపీసీపీడీసీఎల్, మైన్స్ అండ్ జియాలజీ, గ్రామీణ నీటి సరఫరా విభాగాలకు రెండు చొప్పున అర్జీలు వచ్చాయి. ఆరోగ్యం, వ్యవసాయం, గృహ నిర్మాణం, పొల్యూషన్, ఉపాధి కల్పన, సర్వే అండ్ సెటిల్‌మెంట్, పశు సంవర్ధక, పారిశ్రామిక శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి పి.జ్యోతి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 28లోగా తప్పనిసరిగా లైఫ్ సర్టిఫికేట్లు సమర్పించాలి

● ఖజానా కార్యాలయాల్లో అందుబాటులో ప్రత్యేక కౌంటర్లు

● ఎన్‌టీఆర్ జిల్లా ఖజానా, అకౌంట్స్ అధికారి ఎ.రవి



**విజయవాడ,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, కుటుంబ పింఛనుదారులు తమ వార్షిక జీవన ప్రమాణ ధ్రువీకరణ పత్రాన్ని (లైఫ్ వెరిఫికేషన్ సర్టిఫికేట్) జనవరి 1 నుంచి ఫిబ్రవరి నెలాఖరులోగా సమర్పించాలని ఎన్‌టీఆర్ జిల్లా ఖజానా, అకౌంట్స్ అధికారి ఎ.రవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ వార్షిక జీవన ప్రమాణ ధ్రువీకరణ పత్రాన్ని జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా లేదా పెన్షనర్ల వ్యక్తిగత సీఎంఎఫ్ఎస్ లాగిన్ ద్వారా లేదా ఏదైనా ఖజానా కార్యాలయంలో సమర్పించాలన్నారు. పెన్షనర్ల ఆధార్ నంబరు, మొబైల్ నంబరు (ఓటీపీ కోసం), పీపీవో నంబరు, బ్యాంకు ఖాతా నంబరులను సరిచూసుకోవాలన్నారు. ఫిబ్రవరి 28లోగా లైఫ్ సర్టిఫికేట్ సమర్పించకుంటే ఏప్రిల్ 1వ తేదీన ఇచ్చే మార్చి నెల పింఛను నిలిపేయడం జరుగుతుందని, ఈ విషయాన్ని పెన్షనర్లు గుర్తించాలన్నారు. జిల్లా పరిధిలో విజయవాడ తూర్పులోని డివిజనల్ ఖజానా కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. అదేవిధంగా నందిగామ, జగ్గయ్యపేట, కంచికచర్ల, మైలవరం, తిరువూరు, విస్సన్నపేట ఖజానా కార్యాలయాల్లోనూ ఫించనుదారులు తమ లైఫ్ సర్టిఫికేట్‌ను సమర్పించవచ్చన్నారు. ఏవైనా సందేహాలు, ఇబ్బందులు ఉంటే సంబంధిత ఖజానా కార్యాలయ అధికారులను సంప్రదించి, పరిష్కరించుకోవాలని ఖజానా అధికారి ఎ.రవి సూచించారు.

# బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో పలు కాలనీలకు మహర్దశ



**హనుమాన్ జంక్షన్,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చేస్తున్న రోడ్ల నిర్మాణం కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే రోడ్ల నిర్మాణాలు ఊపం దుకున్నాయి. సుమారు 42 లక్షల రూపాయల నిధులతో గ్రామంలోని పలు కాలనీల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణాలు చేపట్టారు. గతంలో సరైన రోడ్లు లేక చిన్నపాటి వర్షానికే రోడ్లు అన్ని బురద మయంగా మారి కాలనీ వాసులు నడవటానికి ఇబ్బందులు పడేవారు. కుమ్మరి కాలనీ, ఆర్ పి హెచ్ కాలనీ తో పాటు పలు ప్రాంతాల్లో కొత్తగా సిమెంట్ రోడ్లు వేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సమస్య తీరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. కూటమి ప్రభుత్వానికి, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.. గ్రామంలో రోడ్లు వేయించడానికి చొరవ చూపిన సర్పంచ్ పిల్లా అనితా రామారావు, సీనియర్ టిడిపి నాయకులు లంకా సురేంద్ర మోహన్ బెనర్జీ, గ్రామ అభివృద్ధి కమీటి ఛైర్మన్ గుండపనేని ఉమా వరప్రసాద్, ప్రజాప్రతినిధులు ఉప సర్పంచ్ లంక అజయ్, ఎంపీటీసీ అమృతపల్లి, సూర్యనారాయణ, మండాది రవీంద్ర, ఎంపీటీసీ -1 దూసరి నిర్మల , జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు కుంకినూళ్ల,శ్రీనివాసరావు ఈవో సురేష్ సచివాలయం సిబ్బంది సతీష్ వరుణ్, పలువురు కూటమి నాయకులు గ్రామ పెద్దలు, రోడ్డు కాంట్రాక్టర్ కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

● డ్రోన్ కెమెరాల నిఘా నీడలో నూతన సంవత్సరం వేడుకలు

● సర్కిల్ ఇన్స్పెక్టర్ వై వి ఎల్ నాయుడు



**నందిగామ,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** నూతన సంవత్సర వేడుకలను నిబంధనలో పాటిస్తూ జరుపుకోవాలి. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నందిగామ స్టేషన్ హౌస్ ఆఫీసర్ వై వి ఎల్ నాయుడు హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ నుండి వెలుడిన ఓ ప్రకటనలో పోలీసు కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు, నందిగామ ఏసీపీ తిలక్ ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాల నిఘా నీడలో నూతన సంవత్సర వేడుకలను పరిశీలిస్తూ ఉంటామని సర్కిల్ ఇన్స్పెక్టర్ తెలిపారు. నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ డిసెంబర్ 31 తేదీ రాత్రి నిర్వహించుకునే వేడుకలకు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఆంక్షలు కఠిన తరం చేయడమైనదని సిఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపటం,ట్రిపుల్ రైడింగ్ గుంపులు గుంపులుగా చేరి అల్లర్లు చేయటం,అర్ధరాత్రి రోడ్లపై కేకులు కట్ చేయడం తదితర కార్యక్రమాలు హద్దు మీరితే చర్యలు తప్పవు అన్నారు. నేటి రాత్రి పట్టణంలో గస్తి ముమ్మరం చేయడం జరుగుతుందని సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రకటనలో తెలిపారు.

# సేవాతత్పరులు "భేరి"కి రతన్ టాటా మెమోరియల్ అవార్డు..



**హైదరాబాద్, డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** భారతీయ పారిశ్రామిక దిగ్గజం సేవ మూర్తి భరతమాత ముద్దుబిడ్డ స్వర్గీయ రతన్ టాటా ని స్మరించుకొని అందించిన రతన్ టాటా మెమోరియల్ అవార్డును బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ అందుకున్నారు. ఫిలిం ప్రొడ్యూసర్ బాబ్జి, సినీ హీరో శ్రీచరణ్ మరియు ఎంతో మంది పారిశ్రామికవేత్తలు, పాత్రికేయులు, సామాజిక సేవా మూర్తులు, మానవతావాదులు, టాటా వీరాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం భారతదేశంలో మొట్టమొదటిసారిగా హైదరాబాద్ నుండి ప్రారంభం కావడం యావత్ తెలుగు ప్రజలందరూ గర్వించదగ్గ విషయమని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మన తెలంగాణ ఎడిటర్ దేవులపల్లి అమర్,, హైడ్రా పిఆర్ఓ వేణుగోపాల్ నాయుడు లు విచ్చేసి వివిధ రంగాలలో తమ సేవలు అందిస్తున్న సేవా తత్పరులను రతన్ టాటా మెమోరియల్ అవార్డుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రతన్ టాటా మెమోరియల్ అవార్డు అందుకున్న వారిలో బేరి రామచందర్ యాదవ్ , హీరో హెూమ్ ఫుడ్ సంస్థ తరఫున పి విజయ వర్మ , పారిశ్రామికవేత్త దంగేటి సత్యనారాయణ , దొరబాబు , గ్రామీణ నేచురల్స్ ప్రొప్రైటర్ రాజు, తిక్క రెడ్డి విష్ణుమూర్తి , మోడ్ ఆర్గనైజేషన్ ఫౌండర్ శ్రీనివాస్ , సైన్స్ సొల్యూషన్స్ ఫౌండర్ మృత్యుంజయ గౌడ్ , సినీ నటుడు చరణ్ నాయుడు , రమేష్ ఎంతోమంది చిరు వ్యాపారులు అవార్డులు ఈ సందర్భంగా అందుకున్నారు. అనంతరం రతన్ టాటా మెమోరియల్ అవార్డు అందుకున్న భేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో ప్రతి పారిశ్రామిక వాడల్లో ప్రధానమైన మార్కెట్ యార్డులో రతన్ టాటా విగ్రహాలను నెలకొల్పాలని కోరారు. రతన్ టాటా వచ్చే జయంతి నాటికి రతన్ టాటా విగ్రహాల ఏర్పాటుకు తమ వంతు సహాయం చేస్తానని తెలిపారు. రతన్ టాటా లాంటి మహెూన్నతమైన వ్యక్తికి "భారతరత్న" ఇవ్వాలని కోరారు. తద్వారా భారత రత్న అవార్డుకే మరికొంత ప్రాధాన్యత సంతరించుకుంటుందని అభిప్రాయపడ్డారు. భారతీయ పారిశ్రామిక దిగ్గజం, సేవ మూర్తి భరతమాత ముద్దుబిడ్డ స్వర్గీయ రతన్ టాటా ని పురస్కరించుకొని "ఈఫిల్ లైఫ్ ఆర్ట్స్ క్రాఫ్స్ కల్చరల్ సొసైటీ" వ్యవస్థాపక అధ్యక్షుడు "కలవకొలను శివరాం" మాట్లాడుతూ రతన్ టాటా కోట్లాది భారతీయ హృదయాలకు సీఈఓ అనే నినాదంతో నిర్వాహకుడు కే.శివరాం భావోద్వేకంతో రతన్ టాటా ని స్మరించుకున్నారు, ఈ నినాదం కేవలం నా ఒక్కడిదే కాదు యావత్ భారతీయుల అందరిదీ అని అన్నారు.

# బిజెపి మండల పార్టీ అధ్యక్షులు ఏకగ్రీవం



**నందిగామ,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** భారతీయ జనతా పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఆర్ ఓ సూర్యనారాయణ రాజు ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు మరియు అర్బన్ ప్రాంతాలకు పార్టీ అధ్యక్ష పదవికి ఆదివారం రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు శ్రీరామ్,జిల్లా ప్రధాన కార్యదర్శి బోగవల్లి శ్రీధర్ లు నామినేషన్ పత్రాలు స్వీకరించారు. నందిగామ అర్బన్ పార్టీకి కామేశ్వరరావు,రూరల్ గంట వెంకట్రావు, చంద్రర్లపాడు మండలానికి గుత్త బాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అబ్జర్వర్ కాకాని తరుణ్ తెలిపారు. కంచికచర్ల మండలానికి మహిళా అభ్యర్థిని దేవరకొండ రమాదేవి నామినేషన్ దాఖలు చేయగా పరిశీలించి రెండు రోజుల్లో ప్రకటన చేస్తామని జిల్లా నాయకత్వం తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కొత్త సాంబశివరావు,బూత్ అధ్యక్షులు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర బీసీ గణన జరగాలి తీర్మానించిన బీసీ సమన్వయ కమిటీ




**పెడన,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** దేశవ్యాప్తంగా బీసీ సమగ్ర గణన జరగవలసిన అవసరం ఉందని బిసి సమన్వయ కమిటీ తీర్మానించింది. జిల్లా సమన్వయ కమిటీ సమావేశం సోమవారం నాడు నియోజకవర్గంలోని చిట్టిగూడూరు గ్రామంలోని బిజెపి నాయకుడు వీర్ల కృష్ణ నివాసంలో జరిగింది. కమిటీ రాష్ట్ర చైర్మన్ అంగడాల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బీసీలలో ఐక్యత కొరవడిందని అన్నారు. బ్రిటిష్ కాలం నుంచి కూడా బీసీల లెక్కలకు ఆధారాలు లేవు అన్నారు రాష్ట్ర జనాభాలో బీసీలు 56% ఉన్నప్పటికీ అధికారానికి దూరంగా ఉంటున్నామని ఆవేదన చెందారు. రాష్ట్ర కమిటీ కన్వీనర్ రమణ జిల్లా అధ్యక్షులు లుక్కా వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీలను ఓటు బ్యాంకు గానే రాజకీయ పార్టీలు చూస్తున్నాయని అన్నారు. రాజకీయ పార్టీలకుఎన్నికల సమయంలోనే బీసీలు గుర్తుకు వస్తున్నారని అన్నారు. ఈ పద్ధతిని పార్టీలు మార్చవలసిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో పనులు బీసీ నేతలు పాల్గొన్నారు

# ఇనుమడుస్తున్న మినీ కవితా తేజం

# కవులకు అభినందన -డా. రావి రంగారావు




**గుడివాడ,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** అయిదు దశాబ్దాల క్రితం తెలుగు సాహిత్యంలో ఆవిర్భవించిన మినీ కవిత ఇంతింతై వటుడంతై అన్నట్టుగా ఇనుమడించిందని అందుకు కృషి చేస్తున్న కవులనూ సాహితీ సంస్థలను ప్రముఖ సాహితీ వేత్త, మినీ కవితా ఉద్యమ సారధి డా. రావి రంగారావు ప్రశంసించారు. 1974 లో తనతో పాటు డా. జి వి పూర్ణచందు, డా. అద్దేపల్లి రామ మోహనరావు, కొల్లూరి వంటి వారు ఉద్యమ రూపంలో ప్రచారం చేయగా, తదనంతరం రాష్ట్ర వ్యాప్తంగా కవులెందరో మినీ కవితను భుజాన చేసుకుని మోస్తూవస్తున్నారన్నారు. కొందరు మధ్యలో వదిలి వేయగా కృష్ణా జిల్లా గుడివాడ కు చెందిన వసుధ బసవేశ్వరరావు తొలినాళ్లను నుండి నేటి వరకు మినీ కవితను రాస్తూ, పుస్తకాలు ప్రచురిస్తూ సామాజిక మాధ్యమాల ల ద్వారా ప్రచారం చేస్తూ ఉండడం అభినందనీయమని ప్రశంసించారు. అనంతరం జరిగిన మినీ కవితల సమ్మేళనం వసుధ చదివిన మినీ కవితలు ప్రత్యేక ప్రశంసలు, హర్షధ్వానాలు నోచుకున్నాయి. సభలో కృష్ణా జిల్లా రచయితల సంఘ ప్రధానకార్యదర్శి జి వి పూర్ణచందు, ప్రముఖ సాహితి వేత్తలు మోండెపు ప్రసాద్, మాధవి సనారా, బెహరా ఉమా మహేశ్వరరావు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మినీ కవితా కవులు పాల్గొన్నారు.

**సాహితీ సంస్థల కృషి అపారం :** అనంతరం జరిగిన సాహితీ సంస్థల ప్రతినిధుల సదస్సులో గుడివాడ సాహితీ మిత్రులు ప్రతినిధిగా వసుధ మాట్లాడుతూ సాహిత్య విస్తరణకు, నూతన తరాన్ని తయారు చేయడంలో సాహితీ మిత్రులు సంస్థలు, సమూహాలు విరివిగా కృషి చెయ్యాలన్నారు. అనంతరం కవులను నిర్వాహకులు సత్కరించారు.

# యాదవులను బీసీ 'బీ'లో చేర్చేందుకు కృషి వంశీకృష్ణ





**శ్రీకాకుళం,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడిన ఉత్తరాంధ్ర లోని యాదవ సామాజికవర్గాన్ని బీసీ 'బీ' జాబితాలో చేర్చేందుకు తనవంతు కృషి చేస్తానని విశాఖ దక్షిణ శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు. అది వారం శ్రీకాకుళం నగరంలోని ఓ హెూటల్లో శాసనమండలి సభ్యుడు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు నర్తు రామారావు అధ్యక్షతన ఉత్తరాంధ్ర యాదవుల ఆత్మీయ కల యిక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. హక్కుల సాధన కోసం ఉత్తరాంధ్రలోని యాదవులంతా పార్టీలకు అతీతంగా సంఘటి తంగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సభాధ్యక్షుడు ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ.. యాదవుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తా విస్తానని పేర్కొన్నారు. రాయలసీమలో యాదవ తెగకు చెందిన వారిని బీసీ 'బీ' జాబితాలో చేర్చారని ఈ విషయాన్ని గుర్తించి ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు డిమాండ్ చేశారు. నర్తు సరేంద్రయాదవ్, పొలిన శ్రీనివాస్ , గదిబోయిన గురునాథ్ యాదవ్ గద్దిబోయిన కృష్ణ యాదవ్ , ఉల్లాకుల నీలకంతేశ్వర యాదవ్ , బత్తుల గోవిందరావు, బత్తుల మురళి , పాల్గొన్నారు.

# దీక్ష స్వాముల అన్నదానం కు 20 క్వింటాల బియ్యం విరాళం..



**పెనుగంచిప్రోలు,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దీక్ష స్వాముల అన్న దానం కు పోలిశెట్టి సందీప్ భవానిపురం విజయవాడ వాస్తవ్యులు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానము దీక్ష స్వాముల అన్నదానం నిమిత్తం . 20 (ఇరవై క్వింటాలు బియ్యం) విరాళంగాఆలయ సహాయ కార్యనిర్వహణధికారి తిరుమలేశ్వర రావు కు ఆదివారం అందజేశారు. వారికి దేవస్థానం తరుపున దర్శనం కల్పించి ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలు అంద జేశారు.

# ఆగిరిపల్లి పెద్దకోట్టై సెంటరులో నిరసన కార్యక్రమము




**ఆగిరిపల్లి,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ భీమ్ రావ్ అంబేద్కర్ నుద్దేశించి పార్లమెంటు లో 75 సంవత్సరాల రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జరుగు తున్న చర్చ నుద్దేశించి మాట్లాడుతూ కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అంబేద్కర్ ను అవహేళన చేస్తూ రాజ్యాంగం ప్రాధాన్యత ను కించపరచడాన్ని నిరసిస్తూ సీపీఎంపార్టీ ఆధ్వర్యంలో నాలుగురోడ్ల సెంటర్ పెద్ద కొట్టాయి నందు ధర్నా మరియు నిరసన కార్యక్రమమం చెయ్యటం జరిగింది. కేంద్ర మంత్రి అమితాషా ను తక్ష ణమే బయకాట్ చెయ్యాలని ,మంత్రి పదవినుండి తొలగించాలని ఆగిరిపల్లి మండల సిపిఎం కార్యదర్శి సి. హెచ్. శివ నా మరియు సిపిఎం సినియర్ నాయకులు సత్తు కొటేశ్వరావు డిమండ్ చేసేరు .ఈ కార్యక్రమము ముత్యాల నరేశ్ అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమానికి ఈ .రవీంద్ర, ఎం .సుభాకర్ ,కె.కిరణ్ ఎస్.కె.భాషా, జె.గోపాలరావు, ఎన్ నవీన్,జె .సుబ్బరావు, తదితరులు పాల్గొన్నారు.

# 3న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



**కాకినాడ,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జనవరి 3న నిర్వహించనున్న జిల్లా స్థాయి విద్యా,వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించిన గోడపత్రికను సోమవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో జే.వెంకటరావు, జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్,జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, వినిల్ కుమార్ తో కలిసి ఆవిష్కరించారు.

# లీ ఫార్మా అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం..

● పారిశుధ్య కార్మికులకు కిట్లపంపిణీ. ● సామాజిక భాధ్యత ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలి. ● లీ ఫార్మా సేవలు అభినందనీయం. ● 'ఎంఎల్‌ఏ పల్లా శ్రీనివాసరావు.

**విశాఖపట్నం,డిసెంబర్ 30 (వార్తాప్రభ) :** సామాజిక సేవ కార్యక్రమాలు చేయడం ప్రతి వ్యక్తి బాధ్యతగా తీసుకోవాలని,నిరంతరం లీ ఫార్మా లిమిటెడ్ సంస్థ వారు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంఎల్ఏ పల్లా శ్రీనివాసరావు అన్నారు. లీ ఫార్మా లిమిటెడ్ వారు కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా గాజువాక పురపాలకశాఖ కార్యాలయంలో ప్రాజెక్ట్ స్మూత్ వాక్ పేరిట ఫార్మా లిమిటెడ్ ఉచిత వైద్య శిబిరాన్ని గాజువాక నియోజకవర్గం శాసనసభ సభ్యులు పల్లా శ్రీనివాస రావు, లీ ఫార్మా లిమిటెడ్ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి మరియు జీవీఎంసీ జోనల్ కమీషనర్ బి ఆర్ ఎస్ శేషాద్రి లు ప్రాంభించారు. ఈ శిబిరంలో పారిశుద్ధ కార్మికులు మరియు జోనల్ సిబ్బంది పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు మరియు వైద్య, పోషకాహార సలహాలు వంటి సేవలను వినియోగించుకున్నారు. అలాగే శాసనసభ సభ్యులు వారిచే మరియు లీ ఫార్మా డైరెక్టర్ లీలా రాణిచే పోషకాహార కిట్లను, మంకీ క్యాప్లను పురపాలక సిబ్బందికి ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా లీ ఫార్మా సంస్థ డైరెక్టర్






మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు ముందు ఇంక ఎక్కు వగా చేస్తామనీ తెలిపారు. ఎంఎల్ఏ పల్లా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ఈలాంటి కార్యక్రమానికి ఎల్లపుడు తన వంతు సహకరం అందిస్తాను అని తెలిపారు.తదుపరి వైద్య శిబిరం లో భాగంగా జోన్ల వారీగా పురపాలక శాఖ లొ వున్న 1400మంది సిబ్బంది కి ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తాను అని లీ ఫార్మ సమస్త డైరెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది,లీ ఫార్మా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

